**నాలుగేళ్లలో రూ.4..48 లక్షల కోట్ల ఎన్‌పిఎలు రద్దు**

గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లో రూ.4.48 లక్షల కోట్ల మొండి బాకీలు రద్దు అయ్యాయి. అప్పులు తీసుకున్న సంస్థలు, వ్యక్తులు వడ్డీ లేదా మూ లధనం చెల్లింపులను నిలిపివేస్తే.. వాటిని పారు బకాయిలు (ఎన్‌పిఏ)లుగా పరిగణిస్తారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభకు ఇచ్చిన సమాచారం ప్రకారం..

# ధర్మఘంట

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

**అమెరికా నుంచి చైనాకు మళ్లీ శక్తిమంత చిప్‌లు**

అమెరికా నుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంలో కీలక ముందడుగు పడింది. చైనాలో విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా చెల్లించేందుకు అమెరికా చిప్ కంపెనీలైన ఎన్‌విడియా, ఏఎండీ అంగీకరిం చాయి. దీంతో చిప్ ఎగుమతులు తిరిగి ప్రారంభం కానున్నాయి. భద్రతా కారణాలను చూపుతూ చిప్ ఎగుమతులను అమెరికా నిలిపివేయగా.. ప్రతిగా చైనా అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించింది.

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 134 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | బుధవారం,13 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar




## తెలంగాణ రహదారి అభివృద్ధికి నూతన శకం

- మంత్రి సీతక్క
- హామ్ ప్రాజెక్టును ఆవిష్కరించిన మంత్రులు
- రహదారి అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హామ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాం
- రోడ్లు-భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ సంయుక్తంగా ఈ విధానాన్ని ముందుకు తీసుకెళ్తుంది

## ఆధార్ అప్‌డేట్ ఉంటేనే.. ఫ్రీ జర్నీ!!

- "అమ్మా.. ఆధార్ కార్డ్ అప్‌డేట్ ఉండాలె. లేకుంటే పైసలిచ్చి టికెట్ తీసుకోండి.."
- తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్న మాట
- "ఇయ్యాల్టికి వదిలేస్తున్నాం.. రేపటికల్లా అప్‌డేట్ చేసుకోండ్రి..
- లేకుంటే మాత్రం ఊకోం." ఇది మరికొందరు కండకర్ల చెబుతున్న మాట.
- ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ అని ఉండడమే అందుకు ప్రధాన అభ్యంతరం



హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆధార్ అప్‌డేట్ ఉంటేనే ఆ ప్రయాణం వర్తిస్తుందని పలువురు కండక్టర్లు తెగేసి చెబుతున్నారు. ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ అని ఉండడమే అందుకు ప్రధాన అభ్యంతరంగా చెబుతున్నారు. మన దేశంలో ఆధార్ కార్డులు జారీ అయ్యాక ఇప్పటిదాకా ఎలాంటి అప్‌డేట్ చేసుకోని వాళ్లు కోట్లలోనే ఉన్నారు. అదే టైంలో.. కేవలం పేర్లు, డేట్ ఆఫ్ బర్త్ మాత్రమే మార్చేసుకున్నవాళ్లు ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఉమ్మడి జిల్లాల పేరుమీదే.. ఏపీ రాష్ట్రం అలాగే ఉండిపోతూ వచ్చింది. అయితే తెలంగాణలో ఫ్రీ జర్నీ అమలై ఏడాదిన్నర పైనే అవుతోంది. ఈ క్రమంలో ఆధార్ అప్‌డేట్ - మిగతా3లో



## సీబీఐకి వామనరావు హత్య కేసు

- లాయర్ గట్టు వామనరావు దంపతుల కేసును సిబిఐ కి బదిలీ చేస్తూ ఆదేశాలు
- తన కొడుకు, కోడళ్ళ హత్య కేసును సిబిఐకి బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు గట్టు కిషన్ రావు.
- లాయర్ దంపతుల హత్య కేసును తిరిగి విచారణ జరపాలి
- పిటిషనర్ గట్టు కిషన్ రావుకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశం




## దేశంలో 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై

- "దేశంలోని దాదాపు అన్ని రైల్వే స్టేషన్లలో టెలికాం సంస్థలు 4జీ/5జీ సేవలను అందిస్తున్నాయి
- ప్రయాణికులు ఈ నెట్‌వర్క్‌లను డేటా కనెక్టివిటీ కోసం ఉపయోగించుకుంటున్నారు
- దీనికి అదనంగా, ప్రయాణికుల సౌకర్యార్థం 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యాన్ని కూడా కల్పించాం"

## ఓవైపు యుద్ధ హెచ్చరికలు.. మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు



- యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదు
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలి
- ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు వెల్లడి



## 'గణాంకాలతో సిద్ధంగా ఉండండి'

- ఎన్నికల సంఘానికి సుప్రీం సూచన
- బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే.
- బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది.
- అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలి

## అప్రమత్తంగా ఉండాలి

- తెలంగాణలో భారీ వర్షాలు.. అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు: సీఎం రేవంత్
- "ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి
- భారీ వర్షాలు పడే జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలి
- రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలి



హైదరాబాద్

తెలంగాణలో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్‌లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. "ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు పడే జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలి. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ - మిగతా3లో



## తెలంగాణ ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై దృష్టి

- దేశవ్యాప్తంగా 12,800 శత్రు ఆస్తులున్నాయి
- 600లకుపైగా ఎనిమీ ప్రాపర్టీస్ వేలం దశలో ఉన్నాయి
- ఎనిమీ ప్రాపర్టీస్ వేలం ద్వారా సర్కార్‌కు రూ.107 కోట్ల ఆదాయం
- ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించి, శత్రు ఆస్తులపై తక్షణమే సర్వే చేయించాలి

ఢిల్లీ

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కార్యాలయంలో పునరావాస విభాగం సీనియర్ అధికారులు, ఇండియాలో శత్రు ఆస్తుల సంరక్షక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల - మిగతా3లో



## అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగింపు

- వాణిజ్యం, పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా వాషింగ్టన్‌తో సంప్రదింపులు జరుపుతున్నాం
- భారత్ నుంచి ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులపై అమెరికా ఆగస్టు 7 నుంచి 25 శాతం సుంకం విధించింది
- దీనివల్ల అమెరికాకు జరిగే మొత్తం భారత ఎగుమతుల్లో దాదాపు 55 శాతం విలువపై ప్రభావం పడుతుందని అంచనా


## ఎన్నికల సంఘం తనపని తాను సరిగా చేయడం లేదు




- ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- దుష్టశక్తుల బారినుంచి తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నామని,
- కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం తీరు భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఉంది
- ఈసీ తీరుతో రాజ్యాంగానికి విఘాతమని, తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నాం

## బీసీ గర్జన సభ మరోసారి వాయిదా

- భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన
- భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా
- ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించింది




హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కథన భేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు - మిగతా3లో

# సంపాదకీయం

## సేవాభావానికి ప్రతిరూపం నైటింగేల్

అవివాహితలు ఇంటి పనులు, చర్చి పనులే చేయాలనీ ఆంక్షలు విధించ బడిన రోజులవి. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఆమె ఛేదించింది. ఆ రోజుల్లోనే ఒక విధంగా సంఘం మీద తిరగ బడింది. పేదలకు, అనాథలకు సేవ చేయాలన్న అభిలాషతో, ఇంటా, బయటా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, లక్ష్య సాధనలో మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించింది. రోగుల పాలిటి దేవతగా వెలుగొందింది. ఆమే విశ్వ విఖ్యాత ఫ్లోరెన్స్ నైటింగేల్. నైటింగేల్ ఎంతో గొప్పింటి పిల్ల అయినా నర్సుగా సేవలు అందించడానికే నిశ్చయించుకుంది. ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820, మే 12న ఇటలీలో జన్మించింది. 1853న లండన్ లోని ఓ స్త్రీల ఆస్పత్రిలో సూపరిండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకొని వెళ్ళింది. "ది లేడీ విత్ ది లాంప్" గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక బ్రిటిష్ నర్సు, సామాజిక సంస్కర్తగా, గణాంక నిపుణురాలిగా, ఆధునిక నర్సింగ్ స్థాపకురాలుగా ప్రసిద్ది గాంచింది. వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపు కుంటారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవం నాడు గుర్తు చేసుకుంటారు. ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత, ఏమాత్రం ఉండేవికావు. అయినాకూడా ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగు పని చేయడానికే నిర్ణయించుకుంది. తన తల్లి సాహితి ప్రపంచంలో ధ్రువతారగా వెలగాలని కోరినా, ఫ్లోరెన్స్ నైటింగేల్, జర్మనీలో కైసర్ సంస్థను గూర్చి విని, అక్కడే పని చేయాలనీ నిర్ణయించుకుంది. ఇద్దరు బిడ్డల్ని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది. 1852 లో ఐర్లాండ్ వెళ్ళింది. అక్కడి ఆసుపత్రులను చూడగానే వాటిల్లో విప్లవాత్మకమైన మార్పులను తేవాలి అనుకున్నది. 1853 లో సిస్టర్స్ ఆఫ్ చారిటికి వెళ్ళింది. తిరిగి లండన్ వచ్చి, తన నాయనమ్మకు సేవ చేయడానికి రాగా అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి రోగులకు, పగలు, రాత్రి అనక సేవలందించింది. పరిశు భ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగులకు మంచి ఆహారం అందించింది. 1854-56 లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లోరెన్స్ వచ్చి తోటి నర్సులను కూడగట్టుకొని యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరుపమాన సేవలందించింది. ధైర్యం చెప్పింది. సాటి నర్సులు విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబం లోనుంచి వచ్చిన ఆమె ఏరి కోరి పనిని ఎంతో శ్రద్ధతో, ఇష్టంతో చేసేది. గుండె నిబ్బరంతో, చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. అందుకే ఆమె లేడీ విత్ ది లాంప్ గా వాసికెక్కింది. మొదట్లో ఆమెను చూసి అధికారులు జ్వలించి పోయేవారు. తరువాత ఆమె నిరుపమాన సేవకు ముగ్ధులయ్యారు. వారికి రోజూ, రోగులకు కావాల్సిన మందులు పరికరాలను పంపమని అభ్యర్ధనలు పంపి, పలుమార్లు స్వంత డబ్బు ఖర్చు పెట్టి అన్ని తెప్పించేది. ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్ళను, భవంతులను ఆసుపత్రులుగా మార్చేది. రాత్రులలో రెండు, మూడు గంటలే పడుకుని అహర్నిశలు పని చేసేసరికి ఆమె చిక్కి పోయింది. అయినా రోగులకు ఆమె ఆరాధ్య దైవం. ఆమె నడచిన దారి అతి పవిత్రం. వారు విక్టోరియా రాణి మరణిస్తే ఫ్లొరెన్స్ ను రాణి చేస్తామని" అనేవారట. ఆమె ఎక్కడికి వెళ్ళినా సైనికులు అడవి పూలతో పుష్ప గుచ్చాల నిచ్చేవారట. అది చూసి తోటి డాక్టర్లు, నర్సులు అసూయ చెందేవారట. అయినా ఆమె తన సేవలను మానకుండా చేస్తూండగా ఒకనాడు స్పృహ తప్పి పడిపోయింది. సైనికులకు వచ్చిన జ్వరమే ఆమెకు వచ్చింది. కాసిల్ ఆసుపత్రిలో ఆమెను రోగిగా చేర్చుకున్నారు. ఆమెను చూసి మిగతా రోగులు కన్నీరు కార్చారు. అయినా ఆరోగ్యం మెరుగు పడగానే, తిరిగి క్రిమియా, స్కుటారి ఆసుపత్రుల మధ్య తిరుగుతూ రోగులకు సేవలందించింది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్, అనే గ్రంథాలను వ్రాయడమే కాకుండా, విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్థనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణను ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24 న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సేస్ అనే సంస్థను లండన్‌లో స్థాపించారు. ఆమెను' మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్' గా గుర్తించారు. భారత దేశానికి కూడా ఆమె ఇతోధిక సేవలనందించింది. 1859 లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమిషన్ ను నియమించింది. చెన్నై నగరపు మేయర్ ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టిన రోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. నర్సులు దినోత్సవం రోజున, నర్సింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా విశేష సేవలందించిన నర్సులకు భారత రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందిస్తారు. 1910 ఆగస్ట్ 13 లో ఫ్లొరెన్స్ మరణించినా, సేవా నిరతిగల ప్రతి నర్సు లోను ఆమె కలకాలం జీవించి ఉంటుంది. 1973లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఈ అవార్డులో భాగంగా కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత, స్వచ్ఛంద సంస్థల్లో విశిష్ట సేవలందించిన నర్సులకు ఒక పతకం, ప్రశంసాపతరం, జ్ఞాపికతో పాటు 50వేల రూపాయిల నగదు బహుమతిని బహుకరిస్తారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన వారికి సేవలు చేసే చేతులు ఏవైనా ఉంటె అవి సేవామయులైన నర్సుల చేతులే. మానవ సేవే మాధవ సేవ అని తలంచి, మానవ సేవ ద్వారానే తమ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న వారు నర్సులు. అలాంటి నర్సులకే ఆదర్శప్రాయమైన నైటింగేల్ దన్యురాలు. కరోనా బారిన పడిన బాధితులను కాపాడటానికి ఫ్లొరెన్స్ నైటింగేల్ లు ప్రతి రూపాలుగా వారు చేస్తున్న సేవలు అపూర్వం, అసామాన్యం, అనిర్వచనీయం, అభినందనీయం. కరోనా బాధితులకు నిత్యం సేవలు చేస్తున్న వైద్య సిబ్బందిలో, తమ ప్రాణాలను పణంగా పెట్టి, ప్రధాన పాత్రలు పోషిస్తున్న నర్సుల సేవలను ఎలా మరిచిపోగలం, వారి ఋణం ఎలా తీర్చుకోగలం.

# మాటలలో సమానత్వం... చేతలలో విఫలం



తెలంగాణ రాజకీయాలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఓ పాత అనుమానానికి కొత్త ప్రాణం పోశాయి. బీసీ వర్గానికి చెందిన నేతలపై పార్టీల తీరు ఒకే కొలమానం కాదా? లేదా వారి పట్ల 'సవతి తల్లి' తీరులోనే వ్యవహరి స్తున్నాయా? సంఘటనలు చూస్తే సమాధానం చేదుగా ఉంది. మాట కఠినమై ఉంటే నిజం అంతకంటే కఠినం. ఇటీవలి కొన్ని పరిణామాలు, ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన నేతలపై తీసుకున్న పార్టీల నిర్ణయాలు, ఒకవైపు కఠిన చర్యలు ౦ మరోవైపు ఉపేక్ష, మద్దతు ౦ వంటి విరుద్ధ ధోరణులు మళ్లీ చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఒక అసమానత క్రమంగా స్పష్టమవుతూ వస్తోంది. బీసీ వర్గానికి చెందిన నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో రాజకీయ పార్టీల తీరు వేగంగా, నిర్దాక్షిణ్యంగా ఉంటే, ఇతర ప్రభావశీల వర్గాల నేతల విషయంలో మాత్రం విచారణలు, హెచ్చరికలు, సమీక్షల పేరుతో చర్యలు వాయిదా పడుతున్నాయి. ప్రభావం తక్కువగా ఉన్న నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోగా, బలమైన ఓటు బ్యాంకు, మీడియా ఆకర్షణ కలిగిన నేతల విషయంలో మాత్రం ఉపేక్ష కనిపిస్తుంది. ఈ ధోరణి కేవలం ఒకటి రెండు సంఘటనలకు పరిమితం కాదు. గత కొన్ని సంవత్సరాలుగా చోటుచేసుకున్న అనేక ఉదంతాలు దీనికి సాక్ష్యం చెబుతున్నాయి. తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ నుంచి రాజా సింగ్-రాజీనామా వరకు, కోమటిరెడ్డి-వివాదాలు, కవితా-న్యాయ పరిణామాలు ౦ ఇవన్నీ ఒక సామూహిక సందేశాన్ని పంపు తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీ సమస్యలను పార్టీలు గణనీయంగా గుర్తిస్తున్నప్పటికీ, నాయకులపై తీసుకునే చర్యల్లో అసమానతల భావన, రాజకీయ ప్రయోజనం, కేంద్ర-హై-కమాండ్ ల అలసత్వ ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను క్రమశిక్షణా ఉల్లంఘన ఆరోపణలతో ఒకే రోజు లోపల సస్పెండ్ చేసింది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యానించారని ఆరోపణలు రావడంతో కఠిన చర్య తీసుకున్నామని హైలైట్ చేసింది. అదే సమయంలో గతంలో కాంగ్రెస్‌లోనే అసంతృప్తి స్వరం ఎత్తిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై మాత్రం ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ఆయన వ్యాఖ్యలు, పార్టీకి వ్యతిరేక వైఖరి కూడా అందరికీ తెలిసిన విషయమే అయినా, ఆర్థిక, రాజకీయ, కుటుంబ ప్రాధాన్యం కారణమో కానీ పార్టీ తీరు గణనీయంగా మృదువుగా మారింది. ఇదే పోలిక బీజేపీలోనూ కనిపించింది. 2022లో టి. రాజాసింగ్ చేసిన మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసిన వివాదాస్పద వ్యాఖ్యలపై పార్టీ సస్పెన్షన్ ప్రకటించినా, కొద్ది నెలల్లోనే తిరిగి చేర్చుకుంది. ప్రస్తుతం ఆయన్ను సస్పెండ్ చేసినప్పటికీ, ఆయన ఏ ఇతర పార్టీలలో చేరనని, భాజపా అధిష్టానం ఎప్పుడూ పిలిచినా వెళతాననడం బట్టి, ఈ పరిణామం క్రమశిక్షణ కంటే ఓటు బ్యాంకు లెక్కలు ఎంత బలంగా పనిచేస్తాయో చూపిస్తుంది. బీఆర్ఎస్ విషయంలోనూ ఇదే కథ. ఎమ్మెల్సీ కవితపై కేంద్ర ఏజెన్సీలు విచారణలు జరుపుతున్నా, ఆమె అరెస్టయి జైలుకు వెళ్ళినా, పార్టీ లోపల ఆమె స్థానానికి ఏమాత్రం ముప్పు రాలేదు. వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ ప్రభావం, రాజకీయ అవసరాలు అన్నీ కలిసి ఆమెకు రక్షణ కవచంగా నిలిచాయి. మరో వైపు, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిలో మార్పులు కూడా ఈ సమీకరణల ప్రభావాన్నే ప్రతిబింబించాయి. బండి సంజయ్ బీసీ వర్గానికి చెందిన నాయకుడు. కేంద్రంపై పూర్తి విశ్వాసం, విధేయత ఉన్నప్పటికీ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి అప్పగించారు. ఇటీవల రామచంద్రరావుకు అప్పగించిన బాధ్యతలు కూడా వర్గాల లెక్కలు, రాజకీయ గణితం ఆధారంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమీకరణాలు కొత్తవి కావు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడే బీసీ, మాదిగ, గౌడ, ముస్లిం నేతలపై కఠినత, ప్రభావశీల వర్గాలపై ఉపేక్ష అనే పద్ధతి ఉండేది. తెలంగాణ ఏర్పాటయినా ఆ పాత పద్ధతే కొనసాగుతోంది. ఫలితంగా బీసీ వర్గం తరచుగా తక్కువ ప్రాధాన్యం పొందుతున్న భావన బలపడుతోంది. బీసీ సమస్యలను కేవలం ఎన్నికల వ్యూహంలో ఒక అంశంగా కాకుండా, సమగ్ర రాజకీయ అజెండాలో భాగం చేయడం ఇప్పుడు అత్యవసరం. అలా కాకుండా ఈ ధోరణి కొనసాగితే బీసీ నేతల్లో అసంతృప్తి మరింత పెరుగుతుంది. వ్యక్తిగతంగా కాకుండా సమైక్యంగా ఈ వర్గం స్పందించే పరిస్థితి వస్తే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఒక్క రాత్రిలో మారిపోవచ్చు. కొత్త రాజకీయ శక్తుల ఎదుగుదలకు ఇది బంగారు అవకాశం అవుతుంది. ప్రజాస్వామ్యంలో సమానత్వం ప్రధాన సూత్రం. క్రమశిక్షణ, నిబంధనలు, నిర్ణయాలు అందరికీ ఒకే విధంగా వర్తించాలి. ఒకే తప్పుకు ఒకరికి విద్యుదాఘాతం, మరొకరికి పూలహారం అందించే ధోరణి కొనసాగితే బీసీ వర్గం ఓటు మాత్రమే ఇస్తూ గౌరవం పొందని వర్గంగా మిగిలిపోతుంది. ఈ ప్రశ్న కేవలం బీసీ వర్గానికే సంబంధించినది కాదు, సమానత్వాన్ని నమ్మే ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించాల్సిన అంశం. ఏ పార్టీ అయినా ఈ అసమానతను పట్టించుకోకపోతే, పార్టీల సమీకరణాలు కాదని, ప్రజాభిప్రాయం ఎప్పుడో ఒకరోజు రాజకీయ గణితాన్ని పూర్తిగా మార్చేస్తుంది.

# అవయవ దానమే పవిత్ర ప్రాణదానం



భారత్‌లో ప్రతి రోజు 20 మంది రోగులు అవయవ దాతలు దొరక్క చనిపోవడం జరుగుతోంది. ప్రతి 10 నిమిషాలకు ఒక రోగి అవయవ దాన జాబితాలోకి చేరుతున్నారు. ఒక ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా తన అవయవాలను మరొకరి ప్రాణాలు నిలపడానికి చట్టబద్ధంగా ముందుకు రావడం, దాత అవయవాలను రోగికి ఒక ప్రత్యేక వైద్య విధానం ద్వారా అమర్చడాన్ని "అవయవ దానం" లేదా "ఆర్గాన్ డొనేషన్" అని అంటున్నాం. రోగుల మరణాలకు ఒక పెద్ద కారణంగా అవయవ వైఫల్యం నిలుస్తూ, సరైన సమయంలో అవయవ దాతలు ముందుకు రాకపోవడంతో ప్రాణాలు కూడా పోతున్నాయి. ఒక వ్యక్తి శరీరంలోంచి గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమము లేదా పాంక్రియాస్, ప్రేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకల మజ్జ లేదా బోన్ మ్యారో, స్టెమ్ సెల్స్ లాంటి పలు రకాల అవయవాలు తొలగించి, రోగి శరీరంలో అమర్చడంతో ఆ రోగి ప్రాణాపాయం నుంచి బయట పడతాడు. ప్రపంచవ్యాప్తంగా అవయవ దాతలకు, అవయవ అవసర రోగులకు మధ్య అంతరాలు అధికంగా ఉన్నాయి. అవయవ దానం పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం, అపార్థాలు చుట్టు ముట్టడంతో దాతలు ముందుకు రావడం లేదు. ఈ గంభీర సమస్యను గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం అవయవ దానం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 13 ఆగష్టు రోజున "ప్రపంచ అవయవ దాన దినం" లేదా "వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ అవయవ దాన దినం ఇతివృత్తంగా "పిలుపుకు సమాధానం ఇద్దాం (ఆన్సరింగ్ ది కాల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2021లో 1,44,302 అవయవ దానాలు జరిగాయి. భారత్‌లో 12,259 అవయవ దానాలు జరిగాయని, ప్రపంచ అవయవ దానాల్లో 8 శాతం ఇండియాలోనే జరుగుతున్నట్లు తేలింది. అవయవ దానం రెండు రకాలుగా వర్గీకరించబడింది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి చేసే అవయవ దానంతో పాటు చనిపోయిన వ్యక్తి శరీరం నుంచి సేకరించే అవయవ దానం అనబడు రెండు రకాల అవయవ దానాలు ఉన్నాయి. 1954లో రోనాల్డ్ లీ హెరిక్ అను వ్యక్తి తొలిసారి తన మూత్రపిండాన్ని దానం చేయడంతో ఆయన సోదరుడి ప్రాణాలు నిలిచాయి. ఈ తొలి అవయవ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసిన వైద్యుడిగా డా: జోసెఫ్ ముర్రే అవయవ దాన చరిత్ర పుటల్లో సుస్థిరంగా నిలిచిపోయారు. ఈ విప్లవాత్మక వైద్య ప్రక్రియను సుసాధ్యం చేసిన ముర్రేకా నోబెల్ బహుమతి కూడా వరించడం జరిగింది. ప్రాణాల మీద ఆశ కోల్పోయిన రోగికి అవయవ దానం ద్వారా ప్రాణాలను పోయడమనే దైవ కార్యంగా అవయవ దానాన్ని గుర్తించారు. 18 ఏండ్లు దాటిన ఆరోగ్యవంతులు ఎవరైనా అవయవ దానం చేయవచ్చు. అవయవ దాతల కొరత విపరీతంగా ఉన్నది. కేవలం 10 శాతం రోగులు మాత్రమే సకాలంలో అవయవ మార్పిడితో బాగుపడుతున్నారు. ఒక మిలియన్ జనాల్లో ఒక్కరు మాత్రమే దానానికి ముందుకు రావడం చూస్తున్నాం. ప్రపంచ అవయవ దాన దినం వేదికగా అవయవ దాతలను గుర్తించడం, వారి అనుభవాలను ప్రచారం చేయడం, దాతలుగా ముందుకు రావడాన్ని ప్రోత్సహించడం, పౌర సమాజాన్ని జాగృత పర్చడం లాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలి. అవయవ దాతల కొరత లేకుండా జాగ్రత్త పడాలి. అవయవ మార్పిడి అందక ప్రాణాలు కోల్పోవడాన్ని వ్యతిరేకించాలి.

## అతి పెద్ద భూతల జంతువు ఏనుగు

ఇంద్రుడి వాహనంగా ఐరావతమనే ఏనుగు ఉండడం మనకు తెలుసు. గణేషుడి శిరస్సు కూడా గజ రాజుదే. నేటికీ పలు దేవాలయాల్లో ఏనుగులను దేవుళ్ల ఊరేగింపుల్లో వినియోగించడం జరుగుతున్నది. గజ రాజును చూస్తేనే ఏదో తెలియని ప్రశాంతత అనుభవంలోకి వస్తుంది. గజము, హస్తి, కరేణువు, దంతి, మాతంగం, కుంజరం, వారణం, సింధువు అనబడే పలు పేర్లు కూడా ఉన్నాయి. ఆకారంలో పెద్దది, ప్రజాదరణ కలిగినది, ప్రశాంతతను ప్రసాదించేది, నిదానంగా మనుగడ సాగించేది, భూతలంపై ఆకారంలో అతి పెద్దది అయిన ఏనుగు కూడా నేడు మనుగడ సాధించడం ఒక సవాలుగా మారింది. ఏనుగులు గుంపులు గుంపులుగా నివసిస్తాయి. రోజులో అధిక సమయం విశ్రాంతి తీసుకునే ఏనుగులను అధిక ఆహారం తినే జంతువుగానే కాకుండా ఎక్కువ పేడను వేస్తూ ఎరువును అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఒర రోజు దాదాపు 600 పౌండ్ల ఆహారం తిరగలిగానో ఏనుగులు రోజుకు 250 పౌండ్ల పేడను వేస్తాయి. ప్రతి రోజు 200 లీటర్ల వరకు నీటిని తాగుతుంది. ఏనుగుల మనుగడను ప్రధాన అవరోధంగా మానవుడు నిలవడం విచారకరం. టూరిజం, వినోదం, దేవాలయాల్లో సేవల రూపంలో ఏనుగుల ఉనికికే ప్రమాదకరంగా మారుతున్నాడు నవ్య నరుడు. ప్రతి ఏట అక్రమ వేట రూపంలో వేల ఏనుగులను చంపడం కొనసాగుతున్నది. వీరప్పన్ లాంటి సమూహాలు అక్రమ వేటతో ఏనుగులను చంపి వాటి దంతాలను చీకటి బజారులో అధిన ధనానికి అమ్మడం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40,000 నుంచి 50,000 వరకు ఏనుగుల జనాభా ఉన్నట్లు అంచనా. ఏనుగులు మూడు జాతులుగా కనిపిస్తున్నాయి. ఆఫ్రికన్ సవన్న, ఆఫ్రికన్ ఫారెస్ట్, ఏసియన్ అను మూడు రకాల ఏనుగులు ఉన్నాయి. ఏనుగుల ఆవాసమైన అడవులను నరికి వేయడం, ఆహార వనరుల కోసం పోరాటం, రాజకీయ అస్థిరత, అక్రమ వేట, సాదు జంతువులుగా వాచి స్వేచ్ఛను హరించడం, మానవుడు - ఏనుగు మధ్య సంఘర్షణ లాంటి కారణాలతో గజరాజుల జనాభా క్రమంగా తరుగుతోంది. క్రమంగా ఏనుగుల జనాభా తగ్గుతూ అంతరించే జంతువుల జాబితాలోకి చేరనున్న గజరాజులను కాపాడుకోవడం మన కనీస కర్తవ్యమని నినదించడానికి ప్రతి ఏట 12 ఆగష్టు రోజున "ప్రపంచ ఏనుగు దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ఏనుగులు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే జంతువులుగా సామాన్య ప్రజలకు అవగాహన ఏర్పరచడంతో పాటు వాచి రక్షణకు ఏనుగుల అభయారణ్యాలను నిర్వహించడం తక్షణ అవసరంగా తీసుకోవాలి.

# 'గణాంకాలతో సిద్ధంగా ఉండండి'

**ఇంటర్నెట్ డెస్క్:** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారుబీ గతంలో నమోదైన మరణాల సంఖ్యబీ ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం



చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా.. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ నెల 1న ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, ముసాయిదాలో అది 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

# సీబీఐకి వామనరావు హత్య కేసు

**న్యూఢిల్లీ :** గట్టు వామన రావు దంపతుల కేసు విచారణ జరిపిన సుప్రీంకోర్టులో కీలక తీర్పు వెలువరించింది. లాయర్ గట్టు వామనరావు దంపతుల కేసును సిబిఐ కి బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది సుప్రీంకోర్టు. తన కొడుకు, కోడళ్ళ హత్య కేసును సిబిఐకి బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు గట్టు కిషన్ రావు. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్ కే సింగ్ ల ధర్మాసనం కేసు విచారణ జరిపింది. గట్టు కిషన్ రావు తరఫున సీనియర్ అడ్వకేట్ మేనక గురుస్వామి, చంద్రకాంత్ లు వాదనలు వినిపించారు. లాయర్ దంపతుల హత్య కేసును తిరిగి విచారణ జరపాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే సమయంలో పిటిషనర్ గట్టు కిషన్ రావుకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఫిబ్రవరి 17 ,2021లో వామన్ రావు దంపతులు నడిరోడ్డు పై హత్యకు గురయ్యారు. పెద్దపల్లి జిల్లాలో కారులో వెళ్తుండగా కొందరు దుండగులు గట్టు వామన్ రావు దంపతులను అడ్డగించి అంతా చూస్తుండగానే నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. ఈ కేసును సిబిఐ కి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. పెద్దపల్లి జిల్లా కలవచర్ల వద్ద హైకోర్టు న్యాయవాదులు వామనరావు, నాగమణిలను దుండగులు నాలుగేళ్ల కిందట దారుణహత్య కావడంతో ఆ సమయంలో దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించి పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాయర్ గట్టు వామనరావు దంపతులు తమ హత్యకు కొన్ని రోజుల ముందే తమకు ప్రాణహాని ఉందని హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. అప్పటినుంచి వారిపై బెదిరింపులు, ఒత్తిడి కొనసాగింది. శీలం రంగయ్య లాకప్ డెత్ కేసులో లాయర్ వామనరావు, నాగమణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఆ కేసును వాపస్ తీసుకోవాలని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వారిని




బెదిరించారు.అంతేగాక, రామగుండం సీపీ సత్యనారాయణతో లాయర్ వామనరావు దంపతులకు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అదే సమయంలో అప్పటి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుపై వామనరావు పలు కేసులు వాదిస్తూ ఉండటం ఏకంగా దంపతుల హత్యకు ప్రధాన కారణమై ఉండొచ్చన్న ఆరోపణలు ఉన్నాయి. ఆపై వామనరావు మరణించేముందు చివరిక్షణంలో ఇచ్చిన వాంగ్మూలంలో, తనపై కుంట శ్రీను దాడి చేశాడని వెల్లడించారు. కుంట శ్రీను ఆ సమయంలో మంథని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారని రామగుండం సీపీ తెలిపారు. కానీ ఆ కేసులో నిందితులను సకాలంలో అరెస్ట్ త్వరితగతిన విచారణ జరపలేదని విమర్శలు వచ్చాయి.లాయర్ వామనరావు దంపతుల హత్యపై హైకోర్టు న్యాయవాదులు ఆ సమయంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సుపారీ హత్యేనని ఆరోపించారు, హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని సైతం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రాణహాని ఉందని తెలిపిన వ్యక్తిని ప్రభుత్వం ఎందుకు భద్రత కల్గించలేదని ప్రశ్నించింది


## వీధికుక్కలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..

# సీజేఐకి బాలీవుడ్ నటుడి రిక్వెస్ట్

**ఢిల్లీ** ఎన్‌సీఆర్ పరిధిలోని వీధికుక్కలను షెల్టర్ హోమ్స్‌కు పంపాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పలువురు బాలీవుడ్ ప్రముఖులు నిర్ణయంపై బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. వీధికుక్కల అంశంపై ఆదేశాలను సవరించాలని కోరుతూ బాలీవుడ్ హీరో జాన్ అబ్రహం మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కి లేఖ రాశారు. అదే సమయంలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ సైతం కోర్టు నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెటా డైరెక్టర్‌గా ఉన్న జాన్ అబ్రహం కుక్కలన్నీ వీధికుక్కలు కావని.. సమాజంలో భాగమని, వాటిని చాలామంద్రి ప్రేమిస్తారన్నారు. వాటిని చాలామంది, ముఖ్యంగా ఢిల్లీ వాసులు ప్రేమించే కమ్యూనిటీ కుక్కలుగా అంగీకరిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో జాన్ పేర్కొన్నారు. కోర్టు తాజా ఉత్తర్వులు.. జంతు జనన నియంత్రణ నియమాలు-2023, ఈ అంశంపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన నిర్ణయాలకు విరుద్ధంగా పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కలను తొలగించడం వల్ల సమస్య పరిష్కారం కాదని.. ఈ నిర్ణయాన్ని సమీక్షించి, సవరించాలని కోరారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, నటుడు వరుణ్ ధావన్ సుప్రీం ఉత్తర్వులు అన్యాయంగా పేర్కొంటూ సోషల్ మీడియా వేదికగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. జాన్వీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీని షేర్ చేసింది. వీధికుక్కలు సమాజంలో భాగంగా పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం టీ స్టాల్ బయట బిస్కెట్ల కోసం వేచి ఉండే, రాత్రంతా దుకాణాలకు కాపలాగా ఉండే.. పిల్లలు పాఠశాల నుంచి వచ్చే సమయంలో తోకలు ఊపుతూ స్వాగతించే ఈ కుక్కలేనని పేర్కొన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం జైలు శిక్ష కాదని.. వీధికుక్కలను షెల్టర్‌లలో







ఉంచడం ఆచరణాత్మక పరిష్కారం కాదని.. నైతికమైంది కాదని పేర్కొన్నారు. బదులుగా పెద్ద ఎత్తున స్టెరిలైజేషన్, టీకాలు వేయడం, క్యానిటీ ఫీడింగ్ జోన్‌లు, అడాప్టింగ్ క్యాంపెన్ వంటి చర్యలు తీసుకోవాలని కోరింది. వరుణ్ ధావన్ ఇన్‌స్టా స్టోరీలో సుప్రీం నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. వరుణ్ చాలా సంవత్సరాలు పలు జంతువులను పెంచుకుంటున్నాడు. గతంలోనూ జంతువుల హక్కుల కోసం గళం విప్పాడు. రవీనా టాండన్ సుప్రీం నిర్ణయంపై స్పందించింది. స్థానిక సంస్థలు టీకాలు వేయడం, స్టెరిలైజేషన్ క్యాంపెన్ సరిగ్గా చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై కుక్కల దాడుల ఘటనపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వీధికుక్కలను షెల్టర్ హోమ్స్‌కు తరలించాలని.. తరలింపును అడ్డుకునే సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. ఈ కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయాలని కూడా కోర్టు ఆదేశించింది. కుక్క కాట్లు, రేబిస్ మరణాలు పెరిగిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కేసును సుమోటోగా తీసుకొని విచారించిన కోర్టు.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ పిల్లలు, శిశువుల భద్రత అత్యంత కీలకమైందని.. కొందరు తమను తాము జంతు ప్రేమికులుగా పిలుచుకున్నంత మాత్రాన వారి భద్రతను ప్రమాదంలో పడేయలేమన్నారు. ఈ వ్యాఖ్యలపై పలువురు జంతు ప్రేమికులు, సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగింపు

న్యూఢిల్లీ : అమెరికా కొన్ని భారతీయ ఉత్పత్తులపై కొత్తగా సుంకాలు విధించినప్పటికీ, ఆ దేశంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వాణిజ్యం, పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా వాషింగ్టన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులపై అమెరికా ఆగస్టు 7 నుంచి 25 శాతం సుంకం విధించిందని మంత్రి తెలిపారు. దీనివల్ల అమెరికాకు జరిగే మొత్తం భారత ఎగుమతుల్లో దాదాపు 55 శాతం విలువపై ప్రభావం పడుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా, మరికొన్ని భారతీయ వస్తువులపై ఈ నెల, అంటే ఆగస్టు 27 నుంచి అదనంగా మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక రంగాల ఉత్పత్తులపై ఇప్పటివరకు ఎలాంటి అదనపు సుంకాలు విధించలేదని ఆయన స్పష్టం చేశారు.అమెరికా విధించిన సుంకాల వల్ల భారత ఎగుమతులపై, ముఖ్యంగా టెక్స్‌టైల్స్ రంగంపై పడే ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని జితిన్ ప్రసాద తెలిపారు. ఉత్పత్తి నాణ్యత, డిమాండ్, ఒప్పందాలు వంటి అనేక అంశాలు ఈ ప్రభావాన్ని నిర్ధారిస్తాయని అన్నారు. ఈ విషయంపై ఎగుమతిదారులు, పారిశ్రామిక వర్గాలతో సహా అన్ని భాగస్వామ్య పక్షాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన చెప్పారు. రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా సుంకాల నిర్ణయాలను భారత ప్రభుత్వం "అన్యాయమైనవి, అహేతుకమైనవి, సమర్థనీయం కానివి" అని అభివర్ణించింది. "భారతదేశంలోని 140 కోట్ల ప్రజల ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని, మార్కెట్ అంశాల ఆధారంగానే మా దిగుమతులు ఉంటాయి. ఈ విషయంలో మా వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశాం. అనేక ఇతర దేశాలు కూడా తమ జాతీయ ప్రయోజనాల కోసం చర్యలు తీసుకుంటుంటే... కేవలం భారత్‌పైనే అమెరికా అదనపు సుంకాలు విధించడం అత్యంత దురదృష్టకరం" అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు 2025 మార్చిలో ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఐదు విడతల చర్చలు జరగ్గా, చివరిసారిగా జూలై 14 నుంచి 18 వరకు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు.

## దేశంలో 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై

**న్యూఢిల్లీ :** రైల్వే ప్రయాణికు లకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కేంద్ర ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా' కార్యక్ర మాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో దేశవ్యాప్తం గా 6,115 రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సేవలను అందుబా టులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నెల 8న రాజ్యసభలో అధికారికంగా వెల్లడించారు. రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్ అడిగిన ప్రశ్నకు మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వకంగా సమాధానమి చ్చారు. "దేశంలోని దాదాపు అన్ని రైల్వే స్టేషన్లలో టెలికాం సంస్థలు 4జీ/5జీ సేవలను అందిస్తున్నాయి. ప్రయాణికులు ఈ నెట్‌వర్క్‌లను డేటా కనెక్టివిటీ కోసం ఉపయోగించుకుంటున్నారు. దీనికి అదనంగా, ప్రయాణికుల సౌకర్యార్థం 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యాన్ని కూడా కల్పించాం" అని ఆయన తన ప్రకటనలో స్పష్టం చేశారు. రైల్‌టెల్ సంస్థ ఆధ్వర్యంలో 'రైల్‌వైర్' పేరుతో ఈ ఉచిత వైఫై సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైఫై సేవలు అందుబాటులో ఉన్న ప్రధాన స్టేషన్ల జాబితాలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లు కూడా ఉన్నాయి. వీటితో పాటు న్యూఢిల్లీ, ముంబై సెంట్రల్, చెన్నై సెంట్రల్, హౌరా, బెంగళూరు (యశ్వంత్‌పూర్), అహ్మదాబాద్, భోపాల్, పుణె, భువనేశ్వర్, అమృత్‌సర్, ఎర్నాకుళం, ప్రయాగ్‌రాజ్ వంటి అనేక నగరాల్లోని స్టేషన్లలో కూడా ఈ సౌకర్యం కల్పించారు.ప్రయాణికులు తమ స్మార్ట్‌ఫోన్లలో వైఫై ఆప్షన్ ద్వారా 'రైల్‌వైర్' నెట్‌వర్క్‌ను ఎంచుకుని, తమ మొబైల్ నంబర్‌ను నమోదు చేయాలి. అనంతరం ఫోన్‌కు వచ్చే ఓటీపీ (రాఖ)ని ఎంటర్ చేయడం ద్వారా ఉచిత ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ సేవలతో ప్రయాణికులు స్టేషన్ ప్రాంగణంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్ పనులు చేసుకోవడానికి, వీడియోలు చూడటానికి వీలు కలుగుతుంది.

## ఓవైపు యుద్ధ హెచ్చరికలు.. మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు



**ఇస్లామాబాద్:** భారత్‌పై పాక్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌కు సింధూ జలాలను ఆపేస్తూ.. భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఓ వైపు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మాజీ మంత్రి బిలావల్ భుట్టో బెదిరింపులకు పాల్పడుతుండగా.. మరోవైపు తమకు నీటిని విడుదల చేయాలని ఆ దేశ విదేశాంగ శాఖ భారత్‌ను వేడుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని ఆ దేశ విదేశాంగ శాఖ తాజాగా న్యూదిల్లీని కోరింది. ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపింది. మరోవైపు పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ భారత్‌పై అణు హెచ్చరికలు చేస్తూ.. నోరు పారేసుకుంటున్నారు. 'భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?" అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో సోమవారం కథనాలు వచ్చాయి. ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సైతం భారత్‌పై పిరికిపంద ప్రేలాపనలు చేశారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. ఈ నేపథ్యంలో నీటిని విడుదల చేయాలని భారత్‌ను, పాక్ విదేశాంగ శాఖ అభ్యర్థించడం గమనార్హం. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేయడంతో దాయాది దేశానికి నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. జలాశయాల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. ఇక వాటినుంచి నీటిని తీసుకోలేని స్థితి ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో మరిన్ని కష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని పాక్ అంచనా వేసింది. అయితే ఉగ్రవాదంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది.

## ఎన్నికల సంఘం తనపని తాను సరిగా చేయడం లేదు

కేంద్ర ఎన్నికల సంఘం తనపని తాను సక్రమంగా చేయడం లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం తీరు భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఉందని ఆయన అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఒక మనిషి, ఒక ఓటు అనేది రాజ్యాంగానికి భూమిక అని రాహుల్‌గాంధీ అన్నారు. ఒకరికి ఒక ఓటు అనే అంశాన్ని ఈసీ తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈసీ తీరుతో రాజ్యాంగానికి విఘాతమని, తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నామని చెప్పారు. ఒకరికి ఒక ఓటే ఉండేలా చూసే బాధ్యత ఎన్నికల సంఘానిదని, కానీ ఎన్నికల సంఘం తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చడం లేదని ఆరోపించారు. దుష్టశక్తుల బారినుంచి తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నామని, ఇక ముందు కూడా రాజ్యాంగాన్ని కాపాడుతూనే ఉంటామని రాహుల్‌గాంధీ చెప్పారు. ఎన్నికల సంఘం అవకతవకలకు పాల్పడుతున్న తీరుపై గతంలో తమ దగ్గర రుజువులు లేవని, ఇప్పుడు రుజువులు ఉన్నాయని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో వెనకడుగు వేసే సమస్యే లేదని వ్యాఖ్యానించారు.

# భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

**హైదరాబాద్:** తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక, సోమవారం, మంగళవారం కూడా పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు.. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి.




**నేడు, రేపు భారీ వర్షాలు..**

సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడనున్నాయి. ఇక, ఆదివారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 11.05 సెంటీమీటర్లు, సూర్యాపేట జిల్లా ఫణిగిరిలో 8.93, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 7.28, వరంగల్ జిల్లా దుగ్గొండిలో 6.70 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌తో పాటు నారాయణపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి జిల్లాల్లోనూ అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు.. ఏపీలో రాబోయే రోజుల్లో వర్షాలు జోరందుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. సోమ, మంగళవారాల్లో రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే ఆస్కారం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పశ్చిమ, వాయవ్య గాలుల ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పలుచోట్ల పిడుగులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడనున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కవితది వ్యూహాత్మకమా...

**హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ మహిళా నాయకురాలు, తెలంగాణ ఉద్యమ నాయకురాలు. గులాబీ పార్టీ నుండి ఎంపీగా గెలిచిన మహిళా నేత. ప్రస్తుతం ఆ పార్టీ నుండే ఎమ్మెల్సీగా పని చేస్తున్నారు. అంతేకాకుండా, స్వయానా బీఆర్ఎస్ చీఫ్ కూతురుగా పార్టీలో గుర్తింపు పొందిన నేత. అయితే గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయ పరిణామాలకు తగ్గట్టుగా తనదైన రాజకీయ భాష్యాన్ని తన చర్యల ద్వారా కవిత చెప్పకనే చెబుతున్నారు. సొంత పార్టీతోనే ఢీ అంటే ఢీ అనేలా సవాల్ విసురుతున్నారు. వ్యూహాత్మక కార్యాచరణతో గులాబీ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. మద్యం కుంభకోణం ఆరోపణలతో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కవిత తన సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు రావడం, ఆ తర్వాత మీడియా సమావేశంలో తన లేఖను బయటపెట్టిన వారి పేర్లు వెల్లడి చేయాలని పార్టీని డిమాండ్ చేయడం తెలిసిందే. సమయం, సందర్భం చిక్కినప్పుడల్లా గులాబీ ముఖ్య నేతలపై కవిత రాజకీయ విమర్శలు చేస్తూనే ఉన్నారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని బహిరంగంగానే మీడియా ముందు కవిత తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. అంతటితో మౌనంగా ఉండని కవిత, తన ఆధ్వర్యంలో నడిచే తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే దిశగా పలు చర్యలు చేపట్టారు. మరోవైపు, కాళేశ్వరం కమిషన్ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇందిరా పార్కు వద్ద ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ పార్టీ చేయనిది తాను కేసీఆర్ కోసం ఈ ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించి, పార్టీకి, పార్టీ కార్యకర్తలకు తనదైన శైలిలో రాజకీయ సందేశం పంపారు. ఆ తర్వాత బీసీ ఉద్యమ కార్యాచరణను ఎత్తుకొని మరోసారి ఇందిరా పార్కు వద్ద ధర్నా చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అనుమతి లేకుండానే తాను ఆయా రాజకీయ పార్టీల నేతలను కలుసుకుని మద్దతు కోరడం విశేషం. ఈ చర్యలతోనే కవిత తన సొంత దారి తాను చూసుకుంటున్నానన్న సందేశం చెప్పకనే చెప్పారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాసిన లేఖ బయటపడిన నాటి నుండి కవిత తెలంగాణ భవన్ గడప తొక్కలేదు. అంతేకాదు, కేసీఆర్ నుండి కూడా ఎలాంటి ఆహ్వానం రాలేదు. చివరకు ఫాంహౌస్ నుండి కాళేశ్వరం కమిషన్ ఎదుటకు కేసీఆర్ బయలుదేరే సమయంలో కూడా కవిత దూరం దూరంగానే తండ్రిని ఫాలో అవ్వడం, మీడియాకు



రిలీజ్ చేసిన దృశ్యాల్లో కనిపించడం విశేషం. అయితే అక్కడ ఏం జరిగిందన్నది మనం చెప్పలేం కానీ, రాజకీయ చతురుడైన కేసీఆర్ మీడియా ముందు ఏం చేసినా దానికి ఒక లెక్క ఉంటుందని, మీడియా ముందు ఎవరితో మాట్లాడినా, భుజం మీద చేయి వేసినా కూడా ఒక లెక్క ఉంటుందన్న విషయం గులాబీ పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. అలాంటిది సొంత కూతురు, పార్టీలో సీనియర్ మహిళా నేత అయిన కవిత దూరంగా ఉండటం, కేసీఆర్ కూడా దూరంగా ఉన్నట్లు కనిపించడం కొట్టిపారేసే విషయం ఏమీ కాదు. ఇదిలా ఉంటే, కవిత ఇప్పటి వరకు చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో గులాబీ కండువా ఎక్కడా వేసుకోకపోవడం, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ ఈ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం గమనించాల్సిన మరో విషయం. కేసీఆర్ కోసం ఇందిరా పార్కు వద్ద చేసిన ధర్నాలోనూ తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతి కండువా కప్పుకొని పాల్గొన్నారు. ఆ తర్వాత బీసీ ఉద్యమంలోనూ తన కండువాతో పాటు, బీసీ ఉద్యమానికి సూచిక అయిన నీలి రంగు కండువా కప్పుకున్నారు. ఇక తాజాగా హెచ్ఎంఎస్ కార్మిక సంఘం నేతలతో జరిగిన సమావేశంలోనూ హెచ్ఎంఎస్ కండువా కప్పుకొని మీడియా ముందు కనిపించడం కూడా రాజకీయ సందేశంగానే చెప్పుకోవాలి. ఈ పరిణామాలన్నీ గమనిస్తే కవిత గులాబీ కండువాను దూరం పెట్టిందని తెలుస్తోంది. ఇక తాజా విషయానికి వస్తే, బీఆర్ఎస్ పార్టీ తనను ఒంటరి చేస్తోందని చెబుతున్న కవిత అందుకు తగ్గట్టుగా తన రాజకీయం ఏంటో చూపిస్తున్నట్లుంది. తెలంగాణలో సింగరేణి కార్మికుల ప్రభావం ఎక్కువే. చాలా నియోజకవర్గాల్లో వీరి ప్రభావం కనిపిస్తుంది. బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి తర్వాత టీజీబీకేఎస్ పదవి నుండి కవితను తప్పించారు. ఆ స్థానంలో కొద్ది రోజుల క్రితమే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ నియమించింది. ఈ పరిణామానికి కవిత కూడా దూకుడుగా స్పందిస్తుండటం చూస్తే ఢీ అంటే ఢీ అని బీఆర్ఎస్ కు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తుంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి సంస్థకు అనుబంధంగా కార్మిక విభాగాన్ని పటిష్టం చేశారు. కొత్త శాఖలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఏ పార్టీతో సంబంధం లేని హెచ్ఎంఎస్ కార్మిక సంఘంతో భేటీ అయి వారితో కలిసి పని చేయనున్నట్లు ప్రకటించారు. ఇది చూస్తుంటే రానున్న రోజుల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగితే సింగరేణితో సహా ఆయా పారిశ్రామిక సంస్థల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాల ఓటమికి కవిత పని చేయాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇదే జరిగితే బీఆర్ఎస్‌తో కవిత అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధపడినట్లే. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ లో ఎలాంటి రాజకీయ మార్పులు తెస్తాయో వేచి చూడాల్సిందే. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీగా ఉంటూ, పార్టీ అనుబంధ కార్మిక సంఘాలు ఉన్నా, మరో పోటీ కార్మిక సంఘంతో కవిత చేతులు కలపడం అనేది పార్టీ లక్ష్మణ రేఖ దాటినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇది రాజకీయంగా బీఆర్ఎస్ ను బలహీనపరిచే చర్యగా అభివర్ణిస్తున్నారు. పార్టీని కాదని కవిత చేసిన ధర్నాలు ఒక ఎత్తయితే, మరో కార్మిక సంఘంతో కలిసి పని చేస్తానని చెప్పడం మరో ఎత్తు. ఇది నేరుగా పార్టీకి సవాల్ విసిరినట్లే అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ చర్యల ద్వారా తాను బలమైన నాయకురాలిని అన్న సంకేతాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటి దాకా అటు కేసీఆర్ కానీ, కేటీఆర్ కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం, కవితపై క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడం లేదా ఈ అసమ్మతిని తగ్గించేలా పిలిచి మాట్లాడకపోవడం అనేది వ్యూహమా లేక ఇది దీర్ఘకాలికంగా పార్టీకి నష్టం చేస్తుందా అన్నది మాత్రం వేచి చూడాలి.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...

**హైదరాబాద్ :** కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించక పోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది. కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది. డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది. యూనివర్సిటీ నినాదం "ఇటబీఇజీబితినీని జీబి ఎనీబీతీ టనీనీతీబబివజూ"కు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది.

# రియల్ డీలా!

-మొదటిపేజీ తరువాయి

రూ.2,157.60 కోట్ల ఆదాయం సమకూరింది. 2024 జనవరి నుంచి జూలై ఆఖరి వరకు 1,50,247 రిజిస్ట్రేషన్లు కాగా, వీటి ద్వారా రూ. 2,481.58 కోట్ల రాగా.. తాజాగా ఏడు నెలల్లో 1,47,236 డాక్యుమెంట్ల ద్వారా రూ.2,518. 98 కోట్లు వచ్చాయి. గత ఏడాది తొలి ఏడు నెలలతో పోలిస్తే ఈసారి ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గినప్పటికీ ఆదాయం పెరగడం కొసమెరుపు.

**కోవిడ్ సంక్షోభం తర్వాత**

కోవిడ్ సంక్షోభం తర్వాత రియల్ భూం ఒక్కసారిగా ఆకాశాన్నంటింది. నగరానికి ఆనుకుని ఉన్న కోకాపేట, నార్సింగి, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మణికొండ, తుక్కుగూడ, ఆది బట్ల, కొత్తూరు, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కోకాపేటలో ఎకరం ఏకంగా రూ.100 కోట్లకుపైగా పలికింది. ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా కొత్తగా అనేక గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, హైరేంజ్ అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలోని ప్లాట్లు, ఇళ్లు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేసేందుకు నగర వాసులే కాకుండా దేశవిదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు, బహుళ జాతి కంపెనీలు ఆసక్తి చూపాయి. ఫలితంగా రోజుకు సగటున 750 నుంచి 1000 ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగేవి. రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరేది.

**రోడ్డున పడ్డ కమీషన్ ఏజెంట్లు**

అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి తోడు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో ఆస్తుల అమ్మకాలు మందగించాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గి ఆ శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయం ఆశించిన స్థాయిలో రావడం లేదు. భవిష్యత్తుపై ఆశతో భూములపై భారీగా పెట్టుబడి పెట్టిన చిరు వ్యాపారులు తమ వెంచర్లలోని ఖాళీ స్థలాలు అమ్ముడుపోక ఆర్థికంగా చితికిపోతున్నారు. అప్పటి వరకు రియాల్టీపై ఆధారపడిన కమీషన్ ఏజెంట్లు ప్రస్తుతం విలవిల్లాడిపోతున్నారు. ఒకప్పుడు ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవితాన్ని గడిపిన వారు ప్రస్తుతం రోజువారీ ఖర్చుల కోసం తమ వద్ద ఉన్న ఆస్తులు, బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉపాధి లేకపోవడంతో కొంతమంది ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోగా, మరికొంత మంది జీవితాలు రోడ్డునపడ్డాయి.

## 6 గ్యారంటీలతో దిగజారిన ఆర్థిక వ్యవస్థ

-మొదటిపేజీ తరువాయి

బడ్జెట్ చూపించారు. కానీ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ముగిసే సమయానికి తెలంగాణకు ?10,583 కోట్ల ఆదాయ లోటు వచ్చింది. ఈ ప్రభుత్వం ఇప్పటికే రూ.20,266 కోట్లు అప్పుగా తీసుకుంది. ఇది వార్షిక లక్ష్యంలో 37.5 శాతం. మరోవైపు రాష్ట్రంలో పన్నేతర ఆదాయాలు తీవ్రమైన తగ్గుదలను సూచిస్తున్నాయి. రూ.2,26,720 కోట్ల బడ్జెట్‌లో కేవలం 3.37 శాతం మాత్రమే ఆదాయాన్ని సాధించారు. ఒక కొత్త రోడ్డు వేయకుండా, ఒక కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించకుండా, విద్యార్థులకు మంచి భోజనం ఇవ్వకుండానే ఈ ప్రభుత్వం ఏకంగా రూ.20,266 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఖర్చు చేసిన డబ్బు ఎక్కడికి పోతోంది? ఆర్థిక వ్యవస్థ ఈ విధంగా కుప్పకూలిపోవడానికి కారణం ఏంటి? తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందని, గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ పరిస్థితిని ఎలా వివరించగలరు?. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు దీనికి వారి వద్ద ఉన్న పరిష్కారం ఏంటో స్పష్టంగా చెప్పగలరా?' అని కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ నేతలను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై కేటీఆర్ పలుమార్లు విమర్శలు గుప్పించారు. ఢిల్లీకి నోట్ల మూటలు మోసేందుకు పదే పదే ఢిల్లీకి వెళ్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టులు చేపట్టకుండా, రైతులు, మహిళలకు హామీలు అమలు చేయకుండా పైసలు ఎక్కడికి పోతున్నాయి అని కేటీఆర్ ప్రశ్నించారు.

## దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలకు అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు సమాచారం. రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు విచారించిన ఈ కమిషన్.. ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం.. ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్‌తోపాటు పలువురు నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని ఆ పార్టీ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారని సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ఒక ప్రచారం అయితే ఉధృతంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఖండించింది.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

-మొదటిపేజీ తరువాయి

ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు సమాచారం.

## రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు

**నిజామాబాద్ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లకు ఒక విడత, బోధన్‌కు మరో విడత పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. స్థానిక సంస్థల పదవీకాలం పూర్తయ్యి దగ్గరదగ్గర ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించలేదు. ఈ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో.. సెప్టెంబర్ 30 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరి అయ్యిందిఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసి రెడీగా ఉంది. నోటిఫికేషన్ రావడమే తరువాయి అంటున్నారు అధికారులు. అయితే త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగున్నాయి. ఈ క్రమంలో సర్పంచి ఎన్నికలకు సంబంధించిన ఓ వార్త వినిపిస్తోంది. రెండు విడతల్లో సర్పంచి ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఆ వివరాలు..రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికల గురించి కీలక ప్రకటన చేసింది. గతంలో అనగా 2019 సర్పంచ్ ఎన్నికలు రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతలుగా జరిగేవి. కానీ ఈసారి రెండు విడతల్లోనే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

# గోర్లను బట్టి ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చు?



విటమిన్, ఖనిజ లోపాలు వంటి పోషకాహార లోపాలు తరచుగా గోళ్ళలో మొదట కనిపిస్తాయి. గోళ్ల రంగు నుండి నీరసం వరకు గోర్లు మీకు ముఖ్యమైన ఆరోగ్య సంకేతాలను ఇస్తాయి. గోర్లు మన శరీరంలో ఒక ప్రత్యేక భాగం. దీనిని సౌందర్య ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించరు. గోర్లు మన మంచి ఆరోగ్యానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. నిపుణులు గోళ్ల రంగును చూసి శరీరంలో ఏ సమస్యలు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. వైద్యుల మాదిరిగానే మీ గోళ్ళను చూసి మీ ఆరోగ్యం గురించి అంచనా వేయవచ్చు. విటమిన్, ఖనిజ లోపాలు వంటి పోషకాహార లోపాలు తరచుగా గోళ్ళలో మొదట కనిపిస్తాయి. గోళ్ల రంగు నుండి నీరసం వరకు గోర్లు మీకు ముఖ్యమైన ఆరోగ్య సంకేతాలను ఇస్తాయి. చల్లని లేదా వంకరగా ఉన్న గోర్లు: ఐరన్ లోపం ఈ సమస్యకు కారణమవుతుంది. పాలిపోయిన లేదా వంకరగా ఉన్న గోర్లు ఐరన్ లోపం లేదా రక్తహీనతతో సంబంధం కలిగి ఉంటాయి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధన ప్రకారం.. కాయిలోనిచియా అనేది గోళ్ల అసాధారణ సమస్య. ఇది అనేక వ్యాధులకు కారణమవుతుంది. విరిగిన గోళ్లు: తరచుగా విరిగిన గోళ్లు సాధారణంగా జింక్, విటమిన్ ఎ లేదా బి-కాంప్లెక్స్ విటమిన్లు లేకపోవడం వల్ల సంభవిస్తాయి. తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ డెర్మటాలజీ, వెనెరాలజీ అండ్ లాప్రాలజీ (2012) లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, పెళుసుగా ఉండే నెయిల్ సింద్రోమ్. ఇది ముఖ్యంగా పోషకాహార లోపం ఉన్న రోగులలో సర్వసాధారణం. గోళ్లపై నీలం-నలుపు మచ్చలు లేదా రంగు మారడం: గోళ్లపై నల్లటి నిలువు గీతలు, మెలనోమా అని పిలుస్తారు. ఇది తరచుగా విటమిన్ బి12 లోపం వల్ల సంభవించవచ్చు. గోళ్ళపై తెల్లని మచ్చలు : గోళ్ళు చాలా పాలిపోయినట్లు ఉంటే లేదా గోళ్ళ అడుగు భాగం తెల్లగా ఉంటే అది తక్కువ హిమోగ్లోబిన్ లేదా ఫోలేట్ లోపానికి సంకేతం కావచ్చు. ప్రోటీన్, విటమిన్ బి12 లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు.



# నిద్రకు- పీరియడ్స్ గురించి ఆసక్తికర విషయాలు

నిద్ర మీ పీరియడ్స్ పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని మీకు తెలుసా? ఇది మీ పీరియడ్స్ సక్రమంగా రాకుండా చేస్తుంది. మీరు 6 గంటలు లేదా అంతకంటే తక్కువ సమయం నిద్రపోతే, మీ పీరియడ్స్ సర్కిల్ మారుతుంది. మహిళలను ప్రధానంగా వేధించేది పీరియడ్ ప్రాబ్లమ్స్. పీరియడ్ పెయిన్, పీరియడ్స్ సరిగ్గా రాకపోవడం వంటి వాటితో వారు బాధపడుతుంటారు. ఋతుచక్రం సక్రమంగా రాకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. శరీరంలో అవసరమైన పోషకాల లోపం, అనారోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు, ఒత్తిడి వంటి అనేక కారణాలు ఋతుచక్రం సక్రమంగా రాకపోవడానికి కారణం కావచ్చు. కానీ చాలా మంది మహిళలకు దీని గురించి తెలియదు. ఈ చెడు అలవాట్లు, నిద్ర లేకపోవడం ఋతుచక్రాన్ని ప్రభావితం చేస్తాయి. దీని కారణంగా పీరియడ్స్ ఆలస్యం కావడమే కాకుండా ఋతుచక్రంపై కూడా ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల ఋతుచక్రంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది. అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం..

ఋతుచక్రం సక్రమంగా ఉండటానికి ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల ఈ హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. నిద్ర లేకపోవడం వల్ల శరీరం ఒత్తిడికి గురై కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు పెరిగి రుతుచక్రంపై నేరుగా ప్రభావం చూపుతుంది. మీరు ప్రతిరోజూ 6 గంటలు లేదా అంతకంటే తక్కువ సమయం నిద్రపోతే, అది మీ ఋతుచక్రాన్ని ప్రభావితం చేస్తుంది. రాత్రి ఆలస్యంగా మేల్కొని, ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం వంటి చెడు అలవాట్లు కూడా ఋతుచక్రం సరిగ్గా రాకుండా చేస్తాయి. అలాగే, నిద్ర లేకపోవడం వల్ల జీవక్రియ, ఇన్సులిన్ నిరోధకతపై ప్రభావం పడి, ఊబకాయం పెరిగే అవకాశం ఉంది. ఈ కారణాలన్నీ కూడా రుతుచక్రం సక్రమంగా లేకపోవడానికి దారితీయవచ్చు. నిద్ర లేకపోవడం ఒత్తిడి హార్మోన్లను పెంచుతుంది. ఇది పునరుత్పత్తి ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. సాధారణంగా రుతుచక్రం 21 నుంచి 35 రోజుల మధ్యలో రావాలి. దీనికంటే తక్కువ రోజుల్లో లేదా ఎక్కువ రోజుల్లో పీరియడ్స్ వస్తే దాన్ని క్రమరహిత రుతుచక్రంగా పరిగణించాలి. నిద్ర లేకపోవడంతో పాటు ఒత్తిడి, విటమిన్ ఐ, విటమిన్ దీ12 వంటి ముఖ్యమైన పోషకాల లోపం కూడా రుతుచక్రంపై ప్రభావం చూపుతాయి. ఆరోగ్యకరమైన రుతుచక్రం కోసం మంచి నిద్ర, సరైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడి లేకుండా ఉండటం చాలా ముఖ్యం. మీకు ఇలాంటి సమస్యలు ఉంటే, వైద్యుడిని సంప్రదించి సలహాలు తీసుకోవడం ఉత్తమం.

# బార్లీ నీళ్లతో ఆ సమస్యలకు చెక్.. ప్రతి రోజూ తాగితే ఎంత మంచిదో!



ప్రస్తుతం చాలా మంది అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ముఖ్యంగా కిడ్నీ, హై కొలెస్ట్రాల్, అధిక బరువుతో అనేక సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి బార్లీ నీళ్లు ఓ వరం అనే చెప్పాలి. ఎందుకంటే? వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వలన చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. ఇది శరీరాన్ని డీటాక్స్‌ఫై చేయడమే కాకుండా, అనేక వ్యాధుల నుంచి బయటపడేలా చేస్తుందంట. ఇక బార్లీ నీటిని ఉదయాన్నే ప్రతి రోజనూ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. ముఖ్యంగా ఇది హైడ్రేషన్, జీర్ణక్రియను మెరుగు పరచడమే కాకుండా, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరాన్ని డిటాక్స్‌ఫై చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోజూ బార్లీ నీళ్లు తీసుకోవాలని చెబుతుంటారు. బార్లీ నీటిలో ఫైబర్,యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాల పుష్కలంగా ఉంటాయి. అందువలన ఇది కడుపు సంబంధ సమస్యలను తగ్గించి, జీర్ణక్రియ మెరుగు పడేలా చేస్తుంది. ప్రతి రోజూ బార్లీ నీళ్లు తాగడం వలన ఇది గుండెల్లో మంట, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది. అంతే కాకుండా మూత్ర పిండాల పనితీరుకు దోహదం చేస్తుంది. మూత్ర పిండాల సమస్యతో బాధపడే వారు ప్రతి రోజూ బార్లీ నీళ్లు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిదంట. ఈ నీటిని ప్రతి రోజూ తాగడం వలన ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తొలిగించి, శరీరాన్ని డిటాక్స్‌ఫై చేస్తుంది. అంతే కాకుండా మూత్రపిండాల పనితీరును మెరుగు పరిచి, కిడ్నీ ఇన్ఫెక్షన్స్, మూత్ర పిండాల్లో రాళ్ల వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. గుండె ఆరోగ్యానికి బార్లీ నీళ్లు చాలా మంచివి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిని ప్రతి రోజూ తాగడం వలన గుండె సమస్యల భయమే ఉండదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.

## ఈ ఆకులను ప్రతి రోజు 2 తింటే చాలు..

# దెబ్బకు ఆ సమస్యలన్నీ పరారు!



బిల్వపత్ర ఆకులను కేవలం పూజలకు మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బిల్వపత్ర ఆకుల్లో ఎన్నో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను క్రమం తప్పకుండా తినడం వల్ల మధుమేహం, జ్వరాలు, గుండె సమస్యల నుంచి రక్షణ పొందవచ్చని నిపుణులు అంటున్నారు. బిల్వ పత్రం (మారేడు ఆకు) అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంది. ఇది మధుమేహాన్ని నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది చర్మ సమస్యలను నయం చేయడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుంది. బిల్వ్రత్ర ఆకుల్లో విటమిన్ ఎ, విటమిన్ బి1, విటమిన్ బి6, విటమిన్ సి, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను రోజూ తింటే అనేక రోగాల నుండి రక్షణ పొందవచ్చు. జీర్ణక్రియ మెరుగుదల: ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. బిల్వపత్ర ఆకులు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఇవి కడుపులో వాత, కఫ దోషాలను సమతుల్యం చేస్తాయి. ఇది జీర్ణక్రియను వేగవంతం చేసి, మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మధుమేహం నియంత్రణ: బిల్వ పత్రంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే గుణం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి షుగర్ ఉన్నవారు దీన్ని తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. మలబద్ధకం నివారణ: బిల్వపత్ర ఆకులలోని ఫైబర్, శ్లేష్మం వంటి పదార్థాలు మలాన్ని మృదువుగా చేసి, పేగుల కదలికను సులభతరం చేస్తాయి. దీనివల్ల దీర్ఘకాలిక మలబద్ధకం తగ్గుతుంది. ప్రతిరోజూ ఈ ఆకులను నమలడం వల్ల ప్రేగులలో పేరుకుపోయిన పాత మలినాలు కూడా తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి : ఈ ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి, జ్వరాలు, ముఖ్యంగా మలేరియా, వైరల్ జ్వరాల నుండి రక్షణ కల్పిస్తాయి. మారుతున్న వాతావరణంలో ఈ ఆకుల కషాయం తాగడం వల్ల జ్వరాల బారినుంచి కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యం:ఆయుర్వేదం ప్రకారం.. బిల్వపత్ర ఆకులు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. బిల్వపత్ర ఆకులను శుభ్రం చేసి ఎండబెట్టి పొడి చేసి తీసుకోవచ్చు. లేదా కషాయంలా తయారుచేసుకుని తాగవచ్చు. ప్రతిరోజూ 5-10 మి.లీ ఆకుల రసం తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వేడి నీటితో ఆకుల పొడిని కలిపి కూడా తాగవచ్చు.

# 2030 నాటికి ఈ మూడు ప్రమాదకర వ్యాధులు ఉండవు



బుడాపెస్ట్‌కు చెందిన ఒక వైద్య విద్యార్థి క్యాన్సర్, అంధత్వం, పక్షవాతం "2030 నాటికి పూర్తిగా నిర్మూలించబడవచ్చు" అని వెల్లడించిన తర్వాత ఒక ఆశ్చర్యకరమైన వైద్య వాదన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అధునాతన టీకాలు, ఆధునిక చికిత్సలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్న తరుణంలో అతని వ్యాఖ్యలు.. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వైద్య విజ్ఞాన శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. వైద్య శాస్త్రంలో సాంకేతికత, చికిత్సా విధానాలు, రోగ నిర్ధారణ పద్ధతులు ఎన్నో రెట్లు మెరుగయ్యాయి. ఫలితంగా, ప్రజల జీవితకాలం పెరిగింది.. వ్యాధుల నుండి కోలుకునే అవకాశాలు మెరుగుపడ్డాయి.. అత్యంత ప్రమాదకరమైన వ్యాధులను నయం చేయడం ఇకపై కేవలం కల మాత్రమే కాదనే స్థాయికి వైద్య శాస్త్రం అభివృద్ధి చెందింది. వాటిని పూర్తిగా నిర్మూలించడానికి మనం కొన్ని అడుగుల దూరంలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. బుడాపెస్ట్‌కు చెందిన ఒక వైద్య విద్యార్థి "క్యాన్సర్, అంధత్వం, పక్షవాతం 2030 నాటికి పూర్తిగా నిర్మూలించబడవచ్చు" అని ప్రకటించిన తర్వాత ఇటీవల ఒక ఆశ్చర్యకరమైన వాదన.. ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ డిజిటల్ సృష్టికర్త ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అధునాతన టీకాలు, ఆధునిక చికిత్సలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నారు.

"2030 నాటికి పూర్తిగా నిర్మూలించబడే మూడు వ్యాధులు ఇక్కడ ఉన్నాయి. మొదటిది, క్యాన్సర్. కీమోను మర్చిపోండి, పరిశోధకులు ఇప్పుడు మీ రోగనిరోధక వ్యవస్థను సైన్యంలా కణితులపై దాడి చేయడానికి శిక్షణ ఇవ్వడానికి ఎ=చీూ క్యాన్సర్ వ్యాక్సిన్‌లను ఉపయోగిస్తున్నారు. వ్యక్తిగతీకరించిన వ్యాక్సిన్‌లు, జన్యు సవరణ, మందులు కూడా చివరి పరీక్ష దశలో ఉన్నాయి. క్యాన్సర్ త్వరలో చికిత్స చేయగలదని, నిర్వహించదగినదని.. ఇకపై ప్రాణాంతకం కాదని చాలా మంది నిపుణులు విశ్వసిస్తున్నారు." "రెండవది, అంధత్వం.. జన్యు సవరణ, మూల కణాలకు ధన్యవాదాలు చెప్పవచ్చు.. రెటీనా వ్యాధులతో బాధపడుతున్న రోగులు తిరిగి చూపును పొందుతున్నారు. ఇప్పటికే ప్రాజెక్టులు ఇద్దరు అంధ రోగులకు తిరిగి చూడటానికి సహాయపడ్డాయి.. ప్రైమ్ ఎడిటింగ్ అనే కొత్త సాంకేతికత వారసత్వంగా అంధత్వానికి కారణమయ్యే జన్యు ఉత్పరివర్తనలను సరిచేయగలదు." "మూడవది, పక్షవాతం. చైనాలో, పూర్తి పక్షవాతం ఉన్న ఇద్దరు వ్యక్తులు మెదడు ఇంప్లాంట్లు, వెన్నుపాము ఉద్దీపనల కలయికను ఉపయోగించి మళ్ళీ నడిచారు. మెదడు అక్షరాలా వెన్నెముక గాయాన్ని దాటవేసి నేరుగా కాళ్ళకు సంకేతాలను పంపింది" అని వైద్య విద్యార్థి క్రిస్ క్రిసాంథౌ జోడించారు.

# సిపిఎస్ ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తాం....

## విద్యా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం లో ముందుండి పోరాడతాం...




టి పి టి ఎఫ్. మంగళవారం నాడు కోదాడ మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రోగ్రాం టీచర్స్ ఫెడరేషన్ టి పి టి ఎఫ్ సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్ష ఉపాధ్యక్షులు రాపర్తి రామ నరసయ్య, బడుగుల సైదులు పాల్గొని మాట్లాడినారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ ను రద్దుచేసి ఓపీ ఎస్ పునరుద్ధరించే వరకు టిపిటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానుఫ్యాక్చర్ లో చెప్పిన విధంగా మాట నిలబెట్టుకోవాలి అన్నారు. విద్యా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడు తామని, ఉపాధ్యాయులుగా బాధ్యతలకు నిలబడుతూ, హక్కుల సాధన కోసం పోరాడుతామని తెలిపారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ సాలార్జంపేట హరిజనవాడ ఆజాద్ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ బడుల బలో పేతానికి తరగతికి ఒక ఉపాధ్యాయుడు నియమించాలని, పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని జూలై 2023 నుండి అమలు చేయాలని, అన్ని క్యాడర్లలో బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా షెడ్యూల్ విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

### నేను జూపల్లి కృష్ణారావు మంత్రిని మాట్లాడుతున్న

**తల్లింద్రులపై బెంగతో ఉన్న చిన్నారి బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసిన మంత్రి**

**చిన్నారిని చూసి వెళ్లాలని సూచించిన మంత్రివి**

**ద్యార్థిని ఓదార్చి ధైర్యం చెప్పిన మంత్రి జూపల్లి**

**గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్ :** పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందా అని మంత్రి అడిగారు. "మా పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతోంది" అని తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని తరగతి గదిని సందర్శంచారు. పర్యావరణం అంటే ఏంటని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉద్బోదించారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని టిజిఈడబ్ల్యుఐడిసి డీఈ వెంకట్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. వెంటనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా టీచర్లు కాంపౌండ్ వాల్, క్రీడా ప్రాంగణం, బాత్రూమ్ వసతులను మెరుగు పరచాలని కోరగా, మంత్రి అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తో మాట్లాడి, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా బాత్రూమ్ ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, కాంపౌండ్ వాల్‌కు నిధులు ఇప్పటికే మంజూరైన నేపథ్యంలో పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ కి ఆదేశాలు ఇచ్చారు

**తల్లితండ్రుల మీద బెంగతో రోదించిన బాలికను ఓదార్చిన మంత్రి జూపల్లి**

నాగర్ కర్నూల్ మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రల మీద బెంగతో రోదిస్తూ.. మంత్రి కంటపడ్డారు. దీంతో మంత్రి ఆ చిన్నారిని వద్దకు వెళ్లి ఓదార్చి, బాగా చదవుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ధైర్యం చెప్పారు. వెంటనే బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయాన్ని మంత్రి వారికి వివరించారు. ప్రతీ శనివారం లేదా ఆదివారం స్కూల్ ను సందర్శంచి మీ పాపతో రెండు గంటల పాటు గడిపి వెళ్లాలని కోరారు. పాఠశాలకు వచ్చి ఆ విద్యార్థిని చూసి వెళ్లాలని సూచించారు. పాపతో వారితో మాట్లాడించారు. మంత్రి నుంచి ఫోన్ రావడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు

# సమీకరణాలు ముందు తెలియదా

**ఖమ్మంలో ముగ్గురు ఉన్నారు... నల్గొండలో ఉంటే తప్పేంటీ**

**కోమటిరెడ్డి హాట్ కామెంట్స్**



**నల్గొండ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో, రేవంత్ సర్కార్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. గత కొంత కాలంగా మంత్రి పదవి కోసం పట్టుపడుతున్న ఆయన.. సీఎం రేవంత్ సహా.. పార్టీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తనకు ఎన్నికలకు ముందు మంత్రి పదవి ఇస్తామని చెప్పి మాట తప్పుతున్నారని.. తన నియోజకవర్గానికి నిధులు కూడా విడుదల చేయటం లేదని బహిరంగంగానే ఘాటు వాఖ్యలు చేస్తున్నారు. తాజాగా.. మరోసారి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మునుగోడు నియోజవర్గంలోని ఎలగలగూడెంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రి పదవి ఉంటే తనకు మంత్రి పదవి ఇవ్వకూడదనే రూల్ ఉందా? అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు మాట ఇచ్చే టైంలో ఈ విషయం తెలియదా అని నిలదీశారు. 'మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టే. నాకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా.. ఇప్పుడు కూడా చెప్తున్నా.. మీరు మాటిచ్చారు. ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటి వరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా నిధుల విడుదలను ఆపొద్దు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది.. సమీకరణాలు కుదరడం లేదు అంటున్నారు. సమీకరణాలు ఎందుకు కుదరటం లేదు?. ఎవరు అడ్డుకుంటున్నారు రాకుండా..? నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని' అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు.'పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండోసారి ప్రామిస్ చేసినప్పుడు మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని తెలియదా? ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉంది. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా?' అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు.'అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్నా. ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దు.. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి. భువనగిరి నుంచి ఎంపీగా పని చేశాను.. నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను.. నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది. ఆ భగవంతుడు ఏ పదవి ఇచ్చినా.. మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదు' అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### జిల్లాలో పోలాలు ఎండుతున్నాయి

**వందలాది టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి**

**మంత్రులకు సోయి లేదు : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**



**నల్గొండ :** నాగార్జునసాగర్ నుంచి వందల టీఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నా జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. ఏఎంఆర్పీ కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. జిల్లా మంత్రులకు చిత్తశుద్ధి లేదు. ఏపీ కి నీళ్లు వదిలేంత ఆతృత, జిల్లాలో రైతులకు నీళ్లు ఇవ్వాలనే తపన లేదని అన్నారు. మా పాలనలో వరుసగా 8 ఏళ్లు చెరువులు నిండుగా ఉంచి? ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చాం. ఏఎంఆర్పీ లిఫ్ట్ కింద డి25, డి26, డి29, డి31, డి39, డి0 డిస్ట్రిబ్యూటరీల కింద 70 వేల ఎకరాలకు నీళు అందించిన ఘనత బీఆర్ఎస్ దే. కోమటిరెడ్డి మంత్రి అయిన తర్వాత మళ్లీ పొలాలు ఎండిపోతున్నాయి. హెలికాప్టర్ల ఆర్భాటాలు, కమిషన్ దందాలు తప్ప రైతుల పట్ల ప్రేమ లేదని అన్నారు. గోదావరి నీటిని ఆంధ్రకు కట్టబెట్టే యత్నాలు జరుగుతున్నాయి. రైతులు ధర్నా చేస్తే కేసులు పెట్టడం దుర్మార్గం. కనీసం ఉదయ సముద్రం నింపడంలేదని అన్నారు. కోమటిరెడ్డి ? ఉత్తమ్ ఇద్దరూ అసమర్థులే. కృష్ణ జలకళ ఉన్నా, జిల్లాలో చెరువులు ఎండిపోయి కనిపిస్తున్నాయి, గత సంవత్సరం కూడా ఇదేవిధంగా పంటలు ఎండబెట్టారు. వెంటనే పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. నల్గొండ గెస్ట్ హౌస్ను మంత్రి సొంత క్యాంపు ఆఫీస్గా మార్చడం అధికార దుర్వినియోగం. నల్గొండ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కోమటిరెడ్డి క్షుద్రపూజలు అని పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారు. కోమటిరెడ్డి కి మంత్రి పదవికి అర్హత లేదని అన్నారు.

# మంథనిలో తీవ్ర యూరియా కొరత

**మందు బస్తా తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తాం**

**ఫెర్టిలైజర్స్ యజమానుల ఇష్టారాజ్యం**

**చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు**

**అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న ఫెర్టిలైజర్ దుకాణాలపై చర్యలేవి**



**మంథని :** ఒకవైపు ప్రభుత్వం యూరియా కొరత లేదు అని స్పష్టం చేసినప్పటికీ పెద్దపెల్లి జిల్లా మంథని లో మాత్రం దీనికి విరుద్ధంగా నడుస్తుంది . మంథని లో ఉన్న అన్ని ఫెర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా కొరత ఉందని రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు . ఏదైనా ఒక మందు బస్తాను లేదా గంట మందును తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తామని షాప్ యజమానులు చెబుతున్నారని ఆ మందుతో అవసరం లేకున్నా కేవలం యూరియా కోసమే ఆ మందు వేల రూపాయలు పెట్టి కొనవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కావలసిన రైతులు గత్యంతరం లేక షాప్ యజమానులు చెప్పిన విధంగా కొంటున్నారు . వ్యవసాయ శాఖ జిల్లా మండల సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా కూడా షాప్ యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరతను ఉన్నట్లు సృష్టించి ఫెర్టిలైజర్స్ షాప్ యజమానులు లక్షల్లో ఆదాయం పొందుతున్నారు . ఫెర్టిలైజర్ షాపుల్లో నిల్వ ఉన్న యూరియాను కూడా అధిక ధరలకు విక్రయించడం వలన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం పడికాపులు కాస్తున్నారు. ఇకనైనా రైతుల బాధను అర్థం చేసుకొని మంథనిలో యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు

### వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాన దంచికొట్టిన వాన

**సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ**

**స్తంభించిపోయిన జనజీవనం.. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం**

**అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ. వర్షపాతం నమోదు**

**వరంగల్ :** వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాన దంచికొట్టింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి (ఊవజీలం ఖీజీతిని) జనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నగరంలోని చెరువులు, కుంటలు పొంగిపొర్లడంతో వరద నీరు ఇళ్లను ముంచెత్తింది. పలు మండలాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే ఖిలావరంగల్‌లో 155.0 మి.మీ., వరంగల్‌లో 148.8 మి.మీ., వర్ధన్నపేటలో 125.4 మి.మీ., ఖానాపూర్‌లో 108.8 మి.మీ. అతి భారీ వర్షం కురిసింది. వర్షపాతం నమోదైంది. అలాగే గీసుగొండలో 90.4 మి.మీ, దుగ్గొండిలో 84.2 మి.మీ, నల్లబెల్లిలో 66.4 మి.మీ, నర్సంపేటలో 86.4 మి.మీ, చెన్నారావుపేటలో 85.4 మి.మీ, రాయపర్తిలో 90.8 మి.మీ, పర్వతగిరిలో 88.6 మి.మీ, నెక్కొండలో 82.4 మి.మీ భారీ వర్షం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లా మొత్తం సగటు వర్షపాతం 107.0 మి.మీగా నమోదైంది.

# మగ బిడ్డకు నాలుగున్నర లక్షలు,ఆడ బిడ్డకు 3 లక్షల ధర

**సృష్టి కేసు సిట్ కు బదిలీ**

**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ సృష్టి కేసును సిట్ కు బదిలీ చేశాం. జులై లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. మొదటగా 8 మందిని తర్వాత 16 మందిని అరెస్ట్ చేశామని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీ నీ చూపించి డబ్బులు వసూలు చేశారు. 10 నుండి 20 లక్షల వరకు డబ్బులు బాధితుల నుండి తీసుకున్నారు. నలుగురు వైద్యులు,మిగిలిన ఏజెంట్లను అరెస్టు చేశామం. విశాఖ లో బేబీ డెలివరీకి ఇచ్చారు. నమ్రత బ్యాంక్ ఖాతాలను నిలుపుదల చేశామని అన్నారు. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరు పై ఉన్న లైసెన్స్ నెంబర్ తో,లెటర్ హెడ్స్ తో అక్రమాలు చేశారు.ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం. 25 మంది అరెస్ట్ అయిన వారిలో వైద్యులు,ఏజెంట్లు ఉన్నారు. సికింద్రాబాద్ సృష్టి సెంటర్ ను పేషంట్స్ వచ్చే వారికి కన్సల్టెన్సీ కేంద్రంగా ఉపయోగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. సృష్టికి అనుమతులు రద్దయి చాలా రోజులైందని అన్నారు. ధన శ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా సబ్ ఏజెంట్లు నియమించుకుని నెట్ వర్క్ ను విస్తరించింది. ఈ కేసులో సరోగెట్ గా, అండ దానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్ల,ఫార్మా వర్కర్లు ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలలు పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసి కోసం వచ్చిన తల్లి తండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు నాలుగున్నర లక్షలు,ఆడ బిడ్డకు 3 లక్షలకు ధర నిర్ధారించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి,అనుమతులు ఉన్న వాటికే ప్రజలు సంప్రదించాలని అన్నారు.

### నిందితులను పట్టుకునేందుకు


### ప్రత్యేక బృందాల ఏర్పాటు

**సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి**

**హైదరాబాద్ :** ఖజానా జ్యువెలరీ బంగారం షాప్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. చోరీ ఘటనపై మాట్లాడిన సీపీ.. 10.35 గంటలకు బైక్ లపై వచ్చిన ఆరుగురు నిందితులు మాస్క్ లు ధరించి షాప్ లోకి చొరబడ్డారని, అందులో ముగ్గురి వద్ద గన్ లు ఉన్నట్లు తెలిపారు. 10.35 నిమిషాల నుండి 10.45 నిమిషాల వరకు నిందితులు షాప్ లోనే ఉన్నారని, షాప్ లోకి చొరబడిన నిందితులు ముందుగా సీసీ టీవీ కెమెరాపై కాల్పులు జరిపారని, అనంతరం లాకర్ తాళాలు ఇవ్వాలంటూ అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కుమార్ పై కాల్పులు జరిపారని అతని కాలుకు గాయాలు అయినట్లు తెలిపారు. ఘటన స్థలంలో రెండు ఖాళీ క్యాట్రిడ్జ్ లు దొరికాయని అన్నారు. నిందితులు షాప్ లో కేవలం 10 నిమిషాలు మాత్రమే ఉన్నారని, స్పాట్ లో దొరికిన వెండి వస్తువులను దోచుకెళ్లారని, ఎంత మొత్తంలో చోరీ జరిగింది అనేది ఇంకా స్పష్టత లేదన్నారు సీపీ అవినాష్ మహంతి. నిందితులను పట్టుకునేందుకు 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, చుట్టుప్రక్కల జిల్లాల పోలీసులను, టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుండి వచ్చారు అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


# బిజినెస్

## నాలుగేళ్లలో రూ.4..48 లక్షల కోట్ల ఎన్‌పిఎలు రద్దు




గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లో రూ.4.48 లక్షల కోట్ల మొండి బాకీలు రద్దు అయ్యాయి. అప్పులు తీసుకున్న సంస్థలు, వ్యక్తులు వడ్డీ లేదా మూలధనం చెల్లింపులను నిలిపివేస్తే.. వాటిని పారు బకాయిలు (ఎన్‌పిఎ)లుగా పరిగణిస్తారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభకు ఇచ్చిన సమాచారం ప్రకారం.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆర్థిక సంవత్సరం 2021-22 నుంచి 2024-25 మధ్య అత్యధికంగా రూ.80,197 కోట్ల ఎన్‌పిఎలను రద్దు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 68,557 కోట్లతో రెండవ స్థానంలో ఉండగా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ. 65,366 కోట్లతో మూడవ స్థానంలో, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ. 55,279 కోట్లతో, కెనరా బ్యాంక్ రూ. 47,359 కోట్లతో, ఇండియన్ బ్యాంక్ రూ. 29,949 కోట్ల రద్దుతో వరుస స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకులు రూ. 4.48 లక్షల కోట్ల మొండి బాకీలను రద్దు చేశాయి. అయితే 2021 మార్చినాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో 9.11 శాతంగా ఉన్న మొండి బాకీలు.. 2025 మార్చి నాటికి 2.58 శాతానికి తగ్గాయి.

## అమెరికా నుంచి చైనాకు మళ్లీ శక్తిమంత చిప్‌లు



అమెరికా నుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంలో కీలక ముందడుగు పడింది. చైనాలో విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా చెల్లించేందుకు అమెరికా చిప్ కంపెనీలైన ఎన్‌విడియా, ఏఎండీ అంగీకరించాయి. దీంతో చిప్ ఎగుమతులు తిరిగి ప్రారంభం కానున్నాయి. భద్రతా కారణాలను చూపుతూ చిప్ ఎగుమతులను అమెరికా నిలిపివేయగా.. ప్రతిగా చైనా అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో లాభాల్లో వాటా తీసుకుని చిప్‌ల ఎగుమతికి అమెరికా ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. చైనాకు అత్యాధునిక చిప్‌లను ఎగుమతి చేయడంపై బైడెన్ హయాంలో అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో చైనా మార్కెట్ కోసం ఎన్‌విడియా అత్యాధునిక హెచ్20 చిప్‌లను రూపొందించింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక వాటిపైనా ఆంక్షలు విధించడంతో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఎన్‌విడియా భారీగా ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ అటు వాషింగ్టన్‌తోనూ ఇటు బీజింగ్‌తోనూ సంప్రదింపులు జరిపారు. డొనాల్డ్ ట్రంప్‌తో గత వారం సమావేశం తర్వాత ఎన్‌విడియా చిప్‌ల ఎగుమతిపై కీలక ప్రకటన చేశారు.

# ఐసీఐసీఐ విషయంలో జోక్యం చేసుకోలేమన్న ఆర్‌బీఐ

బ్యాంకు పొదుపు ఖాతాల్లో కనీస సగటు బ్యాలెన్స్ (మినిమమ్ బ్యాలెన్స్) పరిమితిని నిర్ణయించుకునే స్వేచ్ఛ పూర్తిగా ఆయా బ్యాంకులకే ఉంటుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ విషయం తమ నియంత్రణ పరిధిలోకి రాదని ఆయన తేల్చిచెప్పారు. దేశంలోని రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ, కొత్త ఖాతాదారులకు కనీస బ్యాలెన్స్ పరిమితిని భారీగా పెంచిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం గుజరాత్‌లో జరిగిన ఒక ఆర్థిక సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న సంజయ్ మల్హోత్రా, ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త నిబంధనలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. 'కనీస బ్యాలెన్స్‌ను ఎంత ఉంచాలనేది బ్యాంకుల విచక్షణకే వదిలేశాం. కొన్ని బ్యాంకులు ఈ పరిమితిని రూ.10,000గా నిర్ణయిస్తే, మరికొన్ని రూ.2,000గా ఉంచాయి. చాలా బ్యాంకులు ఈ నిబంధనను పూర్తిగా తొలగించాయి కూడా,' అని ఆయన వివరించారు. ఐసీఐసీఐ బ్యాంక్ జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం, ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారు భారీ మొత్తంలో కనీస సగటు బ్యాలెన్స్‌ను పాటించాల్సి ఉంటుంది. మెట్రో, పట్టణ ప్రాంతాల కస్టమర్లు నెలకు సగటున రూ. 50,000 నిర్వహించాలి. సెమీ-అర్బన్ (పట్టణాలకు సమీప ప్రాంతాలు) కస్టమర్లు రూ. 25,000 పాటించాలి. గ్రామీణ ప్రాంతాల వారు రూ. 10,000 కనీస బ్యాలెన్స్ కలిగి ఉండాలి. అయితే, పాత కస్టమర్లకు మునుపటి




నిబంధనలే వర్తిస్తాయి. మెట్రో, పట్టణ ప్రాంతాల్లో రూ.10,000, గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో రూ.5,000గా పాత పరిమితులు కొనసాగుతాయి. కనీస బ్యాలెన్స్ పాటించని వారి నుంచి తగ్గిన మొత్తంలో 6% లేదా రూ. 500 (ఈ రెండింటిలో ఏది తక్కువైతే అది) జరిమానాగా వసూలు చేస్తారు. అంతేకాకుండా, నెలకు మూడుసార్లు మాత్రమే ఉచితంగా నగదు డిపాజిట్ చేయవచ్చని, ఆ తర్వాత ప్రతి లావాదేవీకి రూ.150 ఛార్జీ విధిస్తామని బ్యాంక్ ప్రకటించింది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2020లోనే కనీస బ్యాలెన్స్ నిబంధనను రద్దు చేసింది.

# అమెరికా కార్పొరేట్ దిగ్గజాలకు ఆర్థిక నష్టాలు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ మీద సుంకాల దాడి చేస్తున్న సంగతి విదితమే. అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్నిసార్లు భారతదేశాన్ని 'టారిఫ్ కింగ్' అంటూ పిలిచిన ట్రంప్.. మరికొన్నిసార్లు 'డెడ్ ఎకానమీ' అంటూ విమర్శలు గుప్పించారు. అయినా సరే రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు బలంగానే ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 131.84 బిలియన్ల డాలర్లకు చేరింది. ఇందులో భారత్ 86.51 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు అమెరికాకు ఎగుమతి చేయగా..45.33 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. భారతదేశం చేసిన ఎగుమతుల్లో ఔషధాలు, రత్నాలు, ఆభరణాలు, ఐటీ ఉత్పత్తులు ఉంటే, దిగుమతులు చేసుకున్న వాటిలో ముడి చమురు, బొగ్గు, విమాన భాగాలు ఉన్నాయి.అయితే ట్రంప్ కొత్తగా ప్రకటించిన 50 శాతం సుంకాలు విషయానికి వస్తే.. అందులో 25 అదనపు జరిమానాలు ఉన్నాయి. ఇవి భారత ఎగుమతులకు పెద్ద అడ్డంకి కావచ్చు. ముఖ్యంగా ఆయన



తరచూ భారత్ రష్యాతో చమురు, ఆయుధాల వ్యాపారం చేస్తోందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిస్థితిలో భారత్ కూడా ప్రతీకారం తీర్చుకువాలనుకుంటే ఈ అమెరికన్ కంపెనీలు పెద్ద ప్రమాదంలో పడతాయి. ఈ టాప్ కంపెనీలకు పరిమితులుతో పాటు సుంకాలు విధిస్తే ఆ కంపెనీలకే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా అది గట్టి షాక్ అవుతుంది. ఇంకా చెప్పాలంటే..అమెరికన్ కంపెనీలు భారత మార్కెట్‌లో ప్రతి రంగంలో గట్టిగా పాతుకు పోయాయి. ఈ-కామర్స్ నుంచి ఫాస్ట్ ఫుడ్, సాంకేతికత నుంచి బ్యాంకింగ్ వరకు అన్నింటిలో ఆ కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అమెజాన్ ఇండియా ఇప్పటికే దేశంలోని 97 శాతం పిన్‌కోడ్లను చేరుకుని దాదాపు ప్రతి ఇంటికి యాక్సెస్ సాధించింది. ఇక ఆపిల్ భారతదేశాన్ని ఐఫోన్‌ల కోసం వేగంగా పెరుగుతున్న మార్కెట్‌గా మలుచుకుంది. టెక్ దిగ్గజాలు గూగుల్, మైక్రోసాఫ్ట్ తమ డేటా సెంటర్లు, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్ లైసెన్సింగ్ ద్వారా విస్తారమైన ఆదాయం భారత్ నుంచి సంపాదిస్తున్నాయి. సోషల్ మీడియా రంగంలో దూసుకుపోతున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ట్విట్టర్ వంటి ప్లాట్‌ఫామ్‌లు కోట్లాది భారతీయుల రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. భారత్ వీటికి ఏదైనా పరిమితి విధిస్తే.. నేరుగా ప్రకటనల ఆదాయంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

# బ్రెవిస్ అజేయ శతకం.. ఆస్ట్రేలియాపై రికార్డు స్కోర్ బాదిన సఫారీలు

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా పొట్టి క్రికెట్‌లోనూ రికార్డులు తిరగరాస్తోంది. లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాను చిత్తు చేసి తొలిసారి ఐసీసీ టైటిల్ గెలుపొందిన సఫారీ టీమ్ ఈసారి ఆసీస్‌పైనే రికార్డు స్కోర్ బాదింది. టీ20ల చరిత్రలో అత్యధిక స్కోర్ నమోదు చేసింది మర్క్‌రమ్ బృందం. యువకెరటం డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసక శతకంతో చెలరేగగా 218 పరుగులు చేసింది ప్రొటీస్ టీమ్. గతంలో కంగారూ జట్టుపై 204 అత్యధికంగా ఉండేది. డార్విన్ మైదానంలో మంగళవారం జూనియర్ డివిలియర్స్ వీరకొట్టుడు కొట్టడంతో 9 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఈ రోజుల్లో పొట్టి క్రికెట్‌లో రెండొందలు కొట్టడం సాధారణం అయిపోయింది. ప్రతి సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనైనా 200 ప్లస్ స్కోర్ నమోదవుతోంది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ దక్షిణాఫ్రికా ఈసారి



విధ్వంసక ఆటతో 218 రన్స్ బాదింది. బలమైన బౌలింగ్ లైనప్ కలిగిన ఆస్ట్రేలియాపై డెవాల్డ్ బ్రెవిస్ (125 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడడంతో కొండంత స్కోర్ చేసింది. దిగ్గజ బ్యాటర్ డివిలియర్స్‌ను తలపడించే ఆటతో ఈ యంగ్‌స్టర్ 56 బంతుల్లోనే 12 ఫోర్లు, 8 సిక్సర్లతో శతకగర్జన చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్(31) మెరుపులు తోడవ్వడంతో ప్రొటీస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి భారీ స్కోర్ చేసింది. గతంలో రెండు పర్యాయాలు కంగారూలపై రెండొందలు కొట్టింది దక్షిణాఫ్రికా. 2016లో జొహన్నెస్‌బర్గ్ మైదానంలో 204 -7, ఇదే గ్రౌండ్‌లో 2006లో 201-4 స్కోర్ బాదింది సఫారీ టీమ్.

# ఇయర్ ఫోన్స్ పెట్టుకోండి... వారిద్దరి సలహాల వల్లే..: యువీ

గెలిస్తే పొంగిపోవద్దు.. ఓటములకు కుంగిపోవద్దు.. గెలిచినపుడు ఆకాశానికి ఎత్తిన వాళ్లే.. కీలక సమయాల్లో ఓడిపోతే విమర్శలు, తిట్లతో ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం అధఃపాతాళానికి జారుకునేలా చేస్తారు. అయితే, అలాంటపుడే రెట్టించిన ఆత్మవిశ్వాసంతో గోడకు కొట్టిన బంతిలా తిరిగి వస్తే.. సూపర్ కదా! 2011లో తాము కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నామని టీమిండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ అన్నాడు. వన్డే వరల్డ్‌కప్ టోర్నమెంట్లో తాము చేసిన తప్పిదాల వల్ల విమర్శల పాలయ్యామని.. అయితే, సచిన్ టెండుల్కర్ వాడ్‌కోచ్ గ్యారీ కిర్‌స్టన్ తమ స్ఫూర్తిదాయక మాటలతో ఆత్మవిశ్వాసం నింపారని తెలిపాడు.

### ఈసారి ఎలాగైనా కప్ గెలవాలి

కాగా మహిళల ఐసీసీ వన్డే వరల్డ్‌కప్-2025కి ఈ ఏడాది శ్రీలంకతో కలిసి భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబరు 30- నవంబరు 2 వరకు జరిగే ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఈసారి ఎలాగైనా కప్ గెలవాలనే పట్టుదలతో ఉంది. మన మహిళల జట్టు ఇప్పటి వరకు ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా అందుకోలేదు. 2005, 2017 వన్డే వరల్డ్‌కప్ టోర్నీల్లో ఫైనల్ వరకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. అయితే, ఈసారి పాత తప్పిదాలు పునరావృతం చేయకుండా గెలిచి తీరతామని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. ఈ మెగా టోర్నీ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జరిగిన ఈవెంట్లో యువరాజ్ సింగ్ కూడా పాల్గొన్నాడు.

### అప్పుడు మాపై తీవ్ర వ్యతిరేకత




ఈ సందర్భంగా భారత మహిళా క్రికెట్ జట్టులో ఆత్మవిశ్వాసం నింపేలా.. 2011 నాటి పరిస్థితుల గురించి యువీ పంచుకున్నాడు. "అప్పటికి ఏ క్రికెట్ జట్టు కూడా సొంతగడ్డపై ఐసీసీ ట్రోఫీని గెలవనే లేదు. అంతేకాదు 28 ఏళ్లుగా భారత్ మళ్లీ వరల్డ్‌కప్ దక్కించుకోలేదు. కాబట్టి అప్పుడు మా పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో మీరు అర్థం చేసుకోవచ్చు. ఇంగ్లండ్‌తో మ్యాచ్ టై చేసుకున్నాం.. ఈ తర్వాత సౌతాఫ్రికాతో గెలిచే మ్యాచ్‌లో ఓటమిపాలయ్యాం. అప్పుడు మాపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. టీవీ చూడొద్దు.. హెడ్‌ఫోన్లు ఆన్‌లో పెట్టుకోండి

ఆ సమయంలో సచిన్ టెండుల్కర్, కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ చెప్పిన మాటలు నాకు ఇంకా గుర్తున్నాయి. 'మనం ఈ టోర్నమెంట్లో విజయం సాధించాలంటే ఈ పనులు తప్పక చేయాలి.. మొదటిది.. ఎవరూ కూడా టీవీ చూడొద్దు. అంతేకాదు.. ఎవరూ వార్తా పత్రికలు చదవొద్దు. అంతేకాదు గ్రౌండ్‌కు వెళ్లే సమయంలో మీ హెడ్‌ఫోన్లు ఆన్‌లో పెట్టుకోండి. కేవలం ఆట మీద మాత్రమే దృష్టి సారించండి. ఆ తర్వాత మళ్లీ డ్రెసింగ్‌రూమ్‌కు వెళ్లే సమయంలో హెడ్‌ఫోన్స్ ఆన్ చేసుకోండి.

### ధోని సేనదే ట్రోఫీ

బయటి నుంచి వచ్చే మాటలను మీరు పట్టించుకోవద్దు. అలాంటపుడే మనం అనుకున్న ఫలితాన్ని రాబట్టగలుగుతాం' అని చెప్పారు" అని యువీ పేర్కొన్నాడు. ఇక దిగ్గజాల సూచనను పాటించిన ధోని సేన ఫైనల్‌కు చేరడమే కాదు.. శ్రీలంకను వాంఖడేలో ఓడించి నాటి వన్డే వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకుంది కూడా!!.. నాటి ఈ టోర్నీలో యువీ ఆద్యంతం అద్భుతంగా ఆడి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

# స్పోర్ట్స్

## టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర




డిజిటల్ వీక్షణకు సంబంధించి టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించబడింది. భారత్, ఇంగ్లండ్ మధ్య టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ-2025లో భాగంగా జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్‌ను (చివరి రోజు ఓ దశలో) ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా రికార్డు స్థాయిలో 13 మిలియన్ మంది వీక్షించారు. డిజిటల్ వీక్షణలో ఇది ఆల్‌టైమ్ రికార్డు. గతంలో ఏ టెస్ట్ మ్యాచ్‌కు ఒకేసారి ఇంత వ్యూయర్‌షిప్ దక్కలేదు. ఈ మ్యాచ్ డిజిటల్ వ్యూయర్‌షిప్ రికార్డులను తిరగరాసింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఇంగ్లండ్‌ను 6 పరుగుల స్వల్ప తేడాతో ఓడించి 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకుంది. చివరి రోజు (ఆగస్ట్ 4) ఇంగ్లండ్ గెలుపుకు 35 పరుగులు అవసరమైన దశలో (చేతిలో 4 వికెట్లు ఉండగా) భారత పేసర్ మహ్మద్ సిరాజ్ అద్భుతం చేశాడు. గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డి (3 వికెట్లు తీసి) టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

### రికార్డులు బద్దలు

టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ-2025లో ఒక్కో మ్యాచ్ ఒక్కో ప్రత్యేక అనుభూతిని మిగిల్చింది. ఈ సిరీస్‌లోని ఐదు మ్యాచ్‌లు చివరి రోజు వరకు ఉత్కంఠగా సాగాయి. టెస్ట్ క్రికెట్‌లో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. దీన్ని బట్టి చూస్తే భారత్, ఇంగ్లండ్ మధ్య పోటీ ఏ రేంజ్‌లో సాగిందో ఇట్టే అర్థమవుతుంది. నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ సిరీస్‌ను విశ్వవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు వేర్వేరు మాధ్యమాల ద్వారా రికార్డు స్థాయిలో వీక్షించారు. డిజిటల్‌కు సంబంధించి ఈ సిరీస్ ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఈ సిరీస్‌ను జియో హాట్‌స్టార్ ద్వారా 170 మిలియన్లకు పైగా వీక్షించారు. డిజిటల్ ప్లాట్‌ఫాం చరిత్రలో ఏ టెస్ట్ సిరీస్‌ను ఇంత మంది వీక్షించలేదు. డిజిటల్‌లో అత్యధిక రీచ్‌ను దక్కించుకున్న సిరీస్‌గా టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ-2025 చరిత్రలో నిలిచిపోతుంది.



## 'కోర్ట్' శ్రీదేవికి పెళ్లయిపోయిందా? ఇది అసలు నిజం



ఈ ఏడాది వచ్చిన హిట్ సినిమాల్లో 'కోర్ట్' ఒకటి. తక్కువ బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం శ్రీదేవి అనే అమ్మాయి మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఇప్పుడు అదే ఊపులో తమిళంలో ఒకటి, తెలుగులో ఒకటి రెండు చిత్రాలు చేస్తోంది. కొన్నిరోజుల క్రితమే సొంతంగా కారు కూడా కొనుక్కుంది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో బాగానే వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఏకంగా ఈమెకు పెళ్లయిపోయిందనే టాక్ వినిపిస్తుంది. ఇంతకీ ఏంటి విషయం? శ్రీదేవి.. రీసెంట్‌గానే రాఖీ పండగని సెలబ్రేట్ చేసుకుంది. తన సోదరుడి చేతికి రాఖీ కట్టింది. ఆ వీడియోని తన ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. అయితే నెటిజన్లు ఈ వీడియో చూసి ఊరుకోకుండా.. ఈమె మెడలో పసుపు తాడు ఉందేంటి అని మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఏంటి ఈమెకు పెళ్లయిపోయిందా? ఇదెప్పుడు జరిగిందా? అని చాలా డిస్కషన్ నడుస్తోంది. అయితే అసలు సంగతి ఇది కాదు. రాఖీ పండగ శనివారం కాగా.. అంతకు ముందు రోజు తెలుగు రాష్ట్రాల్లో శ్రావణ శుక్రవారం సందడి కనిపించింది. అలా శ్రీదేవి ఇంట్లో కూడా వరలక్ష్మీ వ్రతం చేసుకున్నారు. ఈ పూజ తర్వాత పసుపు తాడుకి కట్టిన కాసు(కాయిన్) మెడలో వేసుకుంది. అయితే దీన్ని తాళిబొట్టుగా పొరబడిన నెటిజన్లు.. పెళ్లయిపోయిందా అని కామెంట్స్ పెడుతున్నారు. ఇది అసలు సంగతి!




# మూవీస్



## ఎన్టీఆర్ విలన్ కాదా.. వార్2లో మరో స్టార్ విలన్.?

అగ్రనటులు ఎన్.టి.ఆర్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'వార్ 2' సినిమా మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. ఈ సినిమాతో ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. అయితే ఈ సినిమాలో ఎన్టీఆర్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నట్లు అందరూ అనుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో హృతిక్‌తో కథానాయకుడిగా నటిస్తుండగా.. తారక్ విలన్ అని అనుకున్నారు. కానీ తారక్ కూడా మంచి షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. అలాగే ఈ చిత్రంలో ప్రధాన విలన్ పాత్రలో 'యానిమల్' సినిమాతో సంచలనం సృష్టించిన బాబీ డియోల్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే నందమూరి అభిమానులకు పండగే అని చెప్పవచ్చు. ఇన్నిరోజులు తారక్ విలన్ అని నిరాశలో ఉన్న అతడి అభిమానులు ఈ వార్తతో ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే దీనిపై క్లారిటీ రావాలంటే సినిమా వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.



## అజయ్ దేవ్‌గన్ పిలిస్తేనే వచ్చాడు

### ధనుష్‌తో రిలేషన్‌షిప్ వార్తలపై మృణాళ్ ఠాకూర్

తెలుగు, తమిళంతోపాటు హిందీ భాషల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ యాక్టర్ల జాబితాలో టాప్‌లో ఉంటారు మృణాళ్ ఠాకూర్, ధనుష్. ఈ ఇద్దరు ప్రస్తుతం తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారని తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొన్ని రోజులుగా నెట్టింట పుకార్లు షికారు చేస్తున్నాయి. కొందరు సోషల్ మీడియా యూజర్లు ఏకంగా మృణాళ్ ఠాకూర్ %ాజూశేఅటఎ% మ్యూజిక్ ప్లేలిస్టును వీరిద్దరి లిలేషన్‌షిప్‌కు సాక్ష్యంగా చూపిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ వార్తలపై ఫైనల్‌గా మృణాళ్ ఠాకూర్ స్పందించింది. కోలీవుడ్ మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో డేటింగ్ వార్తలపై స్పష్టత ఇచ్చింది. తనపై వస్తున్న పుకార్ల గురించి తెలుసునన్న మృణాళ్ ఠాకూర్.. ఆ పుకార్లు చాలా ఎంటర్‌టైనింగ్‌గా, నవ్వొచ్చేలా ఉన్నాయని చెప్పింది. 'మేమిద్దరం స్నేహితులం. ధనుష్ నాకు మంచి స్నేహితుడు. కేవలం అజయ్ దేవ్‌గన్ ఆహ్వానించడం వల్లే సన్నాఫ్ సర్దార్ 2 ఈవెంట్‌లో పాల్గొన్నాడని.. ధనుష్‌కు తాను ఇన్విటేషన్‌ను పంపలేదని స్పష్టం చేసింది మృణాళ్ ఠాకూర్. ఎవరూ కూడా ఆ విషయాన్ని అపార్థం చేసుకోవద్దని' చెప్పింది. ఈ కామెంట్స్‌తో ఇద్దరి మధ్య ఎలాంటి రిలేషన్‌షిప్ లేదని క్లారిటీ ఇచ్చేసింది మృణాళ్ ఠాకూర్. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్ డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. దీంతోపాటు హిందీలో మూడు సినిమాలు, తెలుగులో మరో మూవీ చేస్తోంది. ఇటీవలే కుబేర సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ధనుష్.. ప్రస్తుతం ఇడ్లీ కడైతోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు. ధనుష్, ఆనంద్ ఎల్ రాయ్ కాంబోలో వస్తోన్న తేరే ఇష్క్ మే మూవీ షూటింగ్ ముగింపు పార్టీలో మృణాళ్‌ఠాకూర్ కనిపించడంతో మొదటిసారి ధనుష్‌తో ఈ భామ రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు వార్తలు తెరపైకి చ్చాయి. అయితే మరోసారి సన్నాఫ్ సర్దార్ 2 ఈవెంట్‌లో ధనుష్ కనిపించడంతో ఆ పుకార్లు మరోసారి హల్ చల్ చేశాయి.




## కింగ్డమ్'తో ఆకట్టుకున్నాడు.. ఇప్పుడు ఇలా

ప్రస్తుతం రాజమౌళితో సినిమా చేస్తున్న మహేశ్ బాబు.. ఆ బిజీలో ఉన్నాడు. మరోవైపు నిర్మాతగా కొత్త మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ మేరకు డీటైల్స్ బయటపెట్టారు. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేశ్ మహా చాన్నాళ్ల తర్వాత మళ్లీ దర్శకత్వం చేస్తున్నాడు. ఇంతకీ ఈ మూవీ సంగతేంటి? హీరో ఎవరు? టాలీవుడ్‌లో హీరో కమ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకున్న సత్యదేవ్.. ఇటీవలే 'కింగ్డమ్'లోనూ హీరోకి సరిసమానంగా ఉండే నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలో ఆకట్టుకున్నాడు. ఇప్పుడు వెంకటేశ్ మహా దర్శకత్వంలో కొత్త సినిమా చేయబోతున్నాడు. దీనికి 'రావు బహదూర్' అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో పాటు ఫస్ట్ లుక్ కూడా వదిలారు. సత్యదేవ్.. 'రావు బహదూర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌లో డిఫరెంట్‌గా కనిపించాడు. చెప్పాలంటే గుర్తుపట్టడం చాలా కష్టం. ముసలి రాజు గెటప్‌లో అస్సలు గుర్తుపట్టలేనట్లు ఉన్నాడు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్ లైన్‌తో ఈ మూవీ తీస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేస్తున్నట్లు కూడా ప్రకటించేశారు. గతంలో సత్యదేవ్-వెంకటేశ్ మహా 'ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య' అనే మూవీ చేశారు. కాకపోతే అది రీమేక్. ఇప్పుడు ఒరిజినల్ కంటెంట్‌తో వస్తున్నారు. ఈసారి ఏం మ్యాజిక్ చేస్తారో చూడాలి?

## జాన్వీ కపూర్ 'పరమ్ సుందరి' ట్రైలర్ చూశారా.!

బాలీవుడ్ యువ నటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'పరమ్ సుందరి' ఈ సినిమాకు తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తుండగా.. మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే పంజాబీ, మలయాళీ ప్రేమకథాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఆకట్టుకుంటున్న ఈ ట్రైలర్‌ను మీరు చూసేయండి. ఈ చిత్రంలో సంజయ్ కపూర్, మంజ్యోత్ సింగ్, రెంజి పనీకర్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108